**Sahaba Karam ka Dawati Kirdar (Telugu)**

# మహాప్రవక్త (స) సహచరుల సందేశ సరళి


మూలం

**మతీన్ తారిఖ్ బాగ్‌పతి**

అనువాదం

**అబుల్ ఫౌజాన్**



**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

సందేశభవనం, లక్కడ్‌కోట్,

హైదరాబాద్-500 002 ఫోన్:24564583




**Mahapravakta Sahacharula Sandesha Sarali**
**Sahaba Karam ka Dawati Kirdar (Telugu)**


**TIP Series No. : 167**

Written by : Mateen Tariq Bagpati

Translated by : Abul Fouzan



*All Rights Reserved with Publishers*



First Edition : February 2007

Copies : 2000

**Price : Rs. 20**

ISBN : 81-88241-56-3

Published by : Telugu Islamic Publications Trust
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 1. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజిఅన్)

సత్యధర్మాన్ని స్వీకరించి దాన్ని ఇతరులకు అందజేసి, మానవులంతా నిజప్రభువైన అల్లాహ్‌కు మాత్రమే దాసులు అనే యదార్థాన్ని తెలియపరిచిన వారు ఇస్లామీయ చరిత్రలో ఎందరో ఉన్నారు. అయితే వారి ఈ ప్రయత్నాన్ని నిరోధించి శారీరకంగా, మానసికంగా రకరకాలుగా హింసించి, వారిని ఎన్నో కష్టనష్టాలకు గురిచేసారు ధర్మ వ్యతిరేకులు. అయినా సత్యప్రేమికులు మాత్రం సత్యపథం నుండి ఏమాత్రం వెనుకంజ వేయలేదు, ధైర్యాన్ని విడనాడ లేదు.

విశ్వాసి జీవితం దీపంలాంటిది. దీపం వెలగగానే చుట్టుప్రక్కల ఉన్న చీకటి తొలగిపోతుంది. చీకటిని పారద్రోలడమే కాంతి నైజం. 'విశ్వాసం' కూడా ఇలాంటిదే. ఒక వ్యక్తికి 'విశ్వాసం' లాంటి పెన్నిధి దొరకగానే దాన్ని అతడు దాచుకోవటానికి ప్రయత్నించడు. దానికి బదులు 'విశ్వాసం' అనబడే ఈ కాంతితో తన చుట్టుప్రక్కలనున్న చీకట్లను పారదోలాలి, చెడును నిర్మూ లించాలి, మంచిని వ్యాపింపజేయాలి, దైవాన్ని మరచిన దైవదాసులు తిరిగి దైవానికి విశ్వాసపాత్రులుగా మారాలి అనే తపన, అతన్ని లోలోపలి నుండి ప్రేరేపిస్తుంది. దీని కొరకు అతను అహర్నిశలు పాటుపడతాడు. ఈ మార్గంలో, ఎన్ని అవాంతరాలు వచ్చినా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా అతను లెక్క చేయడు. ఈ కోవకు చెందిన వారిలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) జీవితం అత్యంత ఆదర్శప్రాయమైంది.

చిన్నప్పటినుండే ఆయనలో పరిశుభ్రత, వ్యవహారదక్షత ఎక్కువగా ఉండేవి. మంచి గుణగణాలకు, ఉన్నత నైతిక విలువలకు కొదవలేదు. అందు కనే మక్కావాసులు, తమ తగవులు, వివాదాలను ఆయన వద్ద పరిష్కరించు కొనేవారు. అంతేకాక ఆయన మాటకు, అభిప్రాయానికి అత్యంత విలువ



నిచ్చేవారు. అయితే ఆయనకు, తన జాతిలో ప్రబలి ఉన్న విగ్రహారాధన మాత్రం నచ్చేదికాదు. దాని ఔచిత్యంపై ఆయన అసంతృప్తిగానే ఉండేవారు. విగ్రహాల్ని పూజించడం, వాటిముందు మోకరిల్లి తమ కోరికల్ని నెరవేర్చమని వేడటం- ఆయనకు బోధపడేది కాదు. ఆయన పరిపరివిధాల ఆలోచించేవారు. మక్కా వాసులు తాము కాబాగృహానికి పూజారులమని చెప్పుకుంటున్నారు. ఈ గృహాన్ని హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై), హజ్రత్ ఇస్మాయీల్ (అలై) కలసి నిర్మిం చారని ఆయనకు తెలుసు. అయితే ఈ తండ్రీకొడుకులిద్దరూ ఎప్పుడూ విగ్రహా రాధన చేయలేదని కూడా ఆయనకు తెలుసు. విగ్రహారాధన మంచి పనయితే ముందుగా హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) దీన్ని ఆచరించి ఉండేవారు. కాని హజ్రత్ ఇబ్రాహీమ్(అలై) తన తండ్రితో, తన జాతివారితో విగ్రహాల్ని పూజించటం, వాటి ముందు మోకరిల్లటం అవివేకచర్య అని, సూర్య చంద్రులను, భూమిని, మనుషుల్ని, పశువుల్ని సర్వాన్ని సృష్టించినవాడు ఒక్కడే అని, ఆయన్నే మనం ఆరాధించాలని స్పష్టంగా చెప్పారు."

ఇలాంటి ఆలోచనాసరళి కలిగిన హజ్రత్ అబూబకర్(రజి)లో అంతరాత్మ మేల్కొంది. మిథ్యను స్వీకరించటానికి ఆయన సిద్ధం కాలేదు. ఈ కారణం వల్లనే ఆయన తన పూర్వీకులు ఆచరిస్తూ వస్తున్న విగ్రహారాధనకు సుముఖం కాలేకపోయాడు. అయితే అసలైన సత్యమార్గం ఏమిటో ఆయనకు తెలియదు. భూమ్యాకాశాలను, సూర్యచంద్రులను, నక్షత్రాలను, చెట్లను, గుట్టల్ని, అగ్నిని, నీటిని, వాయువును పూజిస్తున్న ఆ అజ్ఞాన వాతావరణంలో ఆయన తనను ఏకాకిగా భావించసాగారు. ఆ పరిస్థితిలో ఎవరైనా సత్యమార్గ శ్రేయోభిలాషి లభిస్తే ఎంత బావుణ్ణు అని ఆయన ఆలోచించేవారు. అప్పుడు మహాప్రవక్త (సఅసం) సత్యసందేశాన్ని ఇలా విన్పించటం మొదలుపెట్టారు:

"మనందరి దైవం ఒక్కడే. ఆయనే ఈ భూమ్యాకాశాల్ని సృష్టించాడు. కాబట్టి మనమంతా ఆ ఒక్కడ్నే ఆరాధించాలి. మీరు ఆరాధిస్తున్న ఈ విగ్రహా లన్నీ మిథ్య. సర్వసృష్టికి ఒకే యజమాని, ఒకే ప్రభువు ఉన్నాడు. అందుకని మనం ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలి, ఆయనకే మొక్కాలి." మహాప్రవక్త (సఅసం) ప్రచారం చేస్తున్న ఈ సందేశం ఆ కాలంలో ఒక విప్లవ నినాదం.

అప్పటి సమాజానికి ఒక యుద్ధభేరి లాంటిది. అందుచేత ఈ సందేశం విని మక్కావాసులు ముఖం చిట్లించుకున్నారు. వారి మసిబారిన హృదయాలకు 'ఒకే దైవం' అనే మాట అసంతృప్తి కల్గించింది. శతాబ్దాల తరబడి బహుదైవారాధన జీవితానికి అలవాటుపడి 'ఏకేశ్వరుడ్ని' మరిచిపోయారు. విగ్రహారాధనలో మునిగితేలుతున్నారు. అందుకే మహాప్రవక్త (సఅసం) ప్రకటించిన ఈ 'సత్యాన్ని' వారు అంగీకరించలేక పోయారు. దీన్ని వారు తమ పూర్వీకుల ధర్మంపై చేస్తున్న దాడిగా భావించసాగారు.

అలాంటి సమాజంలోనే హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ఉన్నారు. ఆయన ఈ 'సత్యం' బయల్పడగానే దాన్ని తన అంతరాత్మఘోషగా భావించి వెంటనే అందుకున్నారు. మొదటిరోజే ఆయన ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. ఆయన మహనీయ ముహమ్మద్ (సఅసం)ను మొదటి నుండి చూస్తున్నారు. ఆ మహనీయుని అమాయక బాల్యం, మచ్చలేని యవ్వనం, ఉన్నతమైన సద్గుణసంపత్తి ఆయన ముందున్నాయి. యావజ్జాతి ఆయన్ని సత్యసంధుడు, నిజాయితీపరుడని పిలుస్తూ వచ్చింది. అలాంటప్పుడు దేవుని విషయంలో ఆయన ఎందుకు అబద్ధాలాడతారు? భూమ్యాకాశాల్ని సృష్టించిన అల్లాహ్‌నే మనం ఆరాధించాలి, ఆయన చూపే మార్గంలోనే నడవాలి అనే కదా ఆయన చెప్తున్నది. ఇందులో అసమంజసమేముంది? ఆయన చెప్పేది మానవుని అంతరాత్మ ఘోషే. హజ్రత్ అబూబకర్ (రజి) ఇంకా ఇలా ఆలోచించారు:

"నా జాతి, ఒకే దైవానికి బదులు అనేక దేవుళ్ళను పూజిస్తున్నది. ఇది తప్పు. తరతరాలుగా అపమార్గంలో జీవితం గడుపుతున్నారు. ఇది ఏవిధంగానూ సమర్థనీయం కాదు. దోపిడీ దొంగతనాలు, హత్యలూ కొట్లాటలు, హింసాదౌర్జన్యాలు వారి అలవాటుగా మారిపోయింది. మధుపానానికి బానిసలైపోయారు. జూదాన్ని వృత్తిగా చేసుకున్నారు. అందుకే సత్యసందేశాన్ని విని కూడా స్వీకరించటం లేదు. ఇలా చూస్తూ ఉండిపోకూడదు. ఈ రుగ్మతల నుండి దైవప్రవక్త తన జాతిని బయటికి తీయాలని ప్రయత్నిస్తున్నారు కనుక నేను ఆయనకు సహాయకారిగా నిలువాలి."

ఇలాంటి భావనలతోనే హజ్రత్ అబూబకర్ (రజి) రంగంలోకి దిగారు.



అయితే దైవధర్మాన్ని సమాజం కోసం స్థాపించటమంటే మాటలు కాదు. ఒక వ్యక్తి ఈ లక్ష్యసాధన కొరకు నిలబడగానే అవహేళనలకు, అపనిందలకు, అష్టకష్టాలకు గురికావలసి వస్తుంది. నలువైపుల నుండి కడగండ్ల కొండలు విరుచుకు పడతాయి. దెబ్బలు తినవలసివస్తుంది. ఇల్లు-వాకిలి వదలిపోవలసి వస్తుంది. ఏ రోజు దైవసందేశం ఈ భువిపై అవతరించ ప్రారంభమయిందో, ఆనాటి నుండే సత్యాసత్యాల మధ్య సంఘర్షణ మొదలయింది. మనిషి సత్య సందేశాన్ని గురించి ఆలోచించటానికిగాని, తన పూర్వీకుల నడతను విడనాడటానికిగాని సిద్ధపడడు. అందుకే సమాజంలోని వారు నిజధర్మాన్ని పరిచయం చేస్తున్నవారికి శత్రువులైపోతారు.

అయితే సత్యాన్ని, సత్యప్రచారాన్నే తమ జీవిత లక్ష్యంగా ఎంచుకొనిన దైవదాసులు కూడా అసామాన్యమైన గుండె నిబ్బరం కలిగి ఉంటారు. తాము అల్లాహ్‌తో ఒక ఒప్పందం చేసుకున్నామని, అందుకని సత్యధర్మ ప్రచార మార్గంలో ఎదురయ్యే సమస్యలు, కష్టాలన్నిటిని ఎంతో సహనం, సాహసాలతో ఎదుర్కొంటారు. అంతేకాదు దైవదాసులు దైవాన్ని మరిచిఉన్నారని, తమ పెడమార్గం ఫలితంగా నరకాగ్నికి సమిధలై పోతారని భావించి ఎంతో ఆందోళన చెందుతారు. ఈ ఆందోళన వారిని తమ విద్యుక్తధర్మం నెరవేర్చనీయకుండా ప్రశాంతంగా కూర్చోనివ్వదు. బహుదైవారాధన ఫలితంగా కలుగబోయే భయంకర పర్యవసానం నుండి మానవుల్ని కాపాడేందుకు వారు అహర్నిశలు పాటుపడతారు. హజ్రత్ అబూబకర్ (రజి) కూడా తనకు నలువైపులా వ్యాపించి ఉన్న బహుదైవారాధనను చూస్తూ ఊరకుండ లేకపోయారు. తన జాతి ప్రజల్లోని అవినీతి, అశ్లీలతల్ని చూసి ఆయన ఆవేదన చెందుతూ వారిని నరకాగ్ని నుండి కాపాడటానికి కంకణం కట్టుకున్నారు.

ఆయన తన సమయాన్ని దైవప్రవక్తతో గడపడానికి, ధర్మానికి సంబంధించిన జ్ఞానసముపార్జన చేయడానికి, దైవప్రవక్త (స) వివిధ తెగల వద్దకు సందేశ ప్రచారానికి వెళ్ళినప్పుడు ఆయన్ను వెన్నంటి ఉండటానికి తన అలవాటుగా చేసుకున్నారు. అంతేకాదు, అవకాశం దొరికినప్పుడు తన బంధువులకు, పరిచయస్థులకు దైవసందేశం అందజేయడానికి కృషి

చేయనారంభించారు. ఆయన సంబోధనా పద్ధతి ఎంతో సమంజసంగా, హృదయానికి హత్తుకునేలా ఉంది. ఆయన వారికి ఇలా హితోపదేశం చేసేవారు: ''చూడండి, దైవప్రవక్త (సఅసం) మన పట్నంలోనే బాల్యం నుండి ఉంటూ వచ్చారు. ఆయన యవ్వనాన్ని మనం కళ్ళారా చూశాం. ఆయన జీవితానికి సంబంధించిన ప్రతి కోణం మన ముందు ఉంది. ఆయన ఏనాడూ అసత్యం పలుకలేదు, ఎవరినీ మోసగించలేదు. ఆయన ఏది చెప్పినా నిజమే చెబుతారు. అందరికీ లాభదాయకమైందే చెబుతారు. ఇప్పుడు కూడా ఆయన ఈ సృష్టి అంతటికీ యజమాని అల్లాహ్ ఒక్కడే అని చెబుతున్నాడంటే అది అక్షరాలా నిజమే. మీరే ఆలోచించండి, మన చేతులతో మలచబడ్డ ఈ విగ్రహాలు ఏమాత్రం శక్తి లేనివి, తమపై వాలే ఈగల్ని సైతం పారదోలుకో లేనివి. ఇలాంటి విగ్రహాలు మనకు దేవుళ్ళు ఎలా అవుతాయి? భూమ్యాకాశాల్ని సృష్టించినవాడు, అందరి అవసరాలు తీర్చేవాడు, ఆకాశం నుండి వర్షం కురిపించేవాడు, భువి నుండి భుక్తి ప్రసాదించేవాడు అయిన సర్వశక్తిమంతుడే మనకు దేవుడు కాగలుగుతాడు. ఆ దైవమే అల్లాహ్. కాబట్టి మనం అల్లాహ్నే ఆరాధించాలి, ఆయన ముందే తలవంచాలి. మన కోరికల్ని, అవసరాలను తీర్చమని ఆయనకే వినిపించుకోవాలి.

ఈ హితబోధతో పాటు హజ్రత్ అబూబకర్ (రజి) ప్రజలకు ఖుర్ఆన్ కూడా చదివి విన్పించేవారు. అందులో ఎలాంటి ఉన్నతమైన, మేలైన విషయా లున్నాయో వివరించేవారు. ఖుర్ఆన్ అవతరణకు పూర్వం ముహమ్మద్ (సఅసం) ఇలాంటి విషయాల్ని మనకు వినిపించి ఉండలేదని, ఇందులో ఉన్నదంతా దైవం తరపున మన శ్రేయం కోసం పంపబడిందేనని, అందుకని మనం ఆయన సందేశాన్ని స్వీకరించాలని ఆయన బోధించేవారు.

ఈవిధంగా హజ్రత్ అబూబకర్ (రజి) తనదైన శైలిలో హితోపదేశం చేస్తుంటే ప్రజలు ఎంతో ప్రభావితులయ్యేవారు. వారిలో అనేకమంది ఇస్లాం స్వీకరించారు. ఇస్లాం స్వీకరించినవారిలో హజ్రత్ ఉస్మాన్ (రజి), హజ్రత్ జుబైర్ (రజి), హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), హజ్రత్ సయీద్ బిన్ వఖాస్ (రజి), హజ్రత్ అబూ ఉబైదా బిన్ జిరాహ్ (రజి), హజ్రత్ అబూతల్హా



(రజి), హజ్రత్ అబూసల్మా (రజి) పేర్కొనదగినవారు. (అల్ బదాయ-3వ భాగం,పేజి-92; హయాతుస్సహాబ-1వ భాగం, పేజి-242 ఆధారంగా)

దైవధర్మం పట్ల ప్రజలందరి వ్యవహారం ఒకేలా ఉండదు, కొందరు స్వయంగా దీన్ని అన్వేషిస్తూ ఉంటారు. ఈ అన్వేషణలో దైవధర్మం తమ ముందుకు రాగానే వారు ఏమాత్రం తటపటాయించకుండా వెంటనే దాన్ని స్వీకరిస్తారు. కొందరు ఇస్లాం పట్ల తమకున్న సందేహాలకు సరైన సమాధానాలు లభించక పోవడం వల్ల దానికి కాస్త దూరంగా ఉంటారు. ఆ సందేహాలు నివృత్తి కాగానే వారు ఎలాంటి సంకోచం లేకుండా దాన్ని స్వీకరిస్తారు.

హజ్రత్ తల్హా (రజి)విషయంలో ఇలాంటి సంఘటనే జరిగింది. ఆయన హజ్రత్ అబూబకర్ (రజి)కు మిత్రులు. మహాప్రవక్త పరిచయం చేస్తున్న నిజధర్మం ఆయన వరకూ చేరింది. కాని ఎందువల్లనో ఆయన ధ్యాస దాని వైపు పోలేదు. ఆ కాలంలోనే ఆయన వ్యాపార సామగ్రితో 'బస్రా' పట్టణం వెళ్ళారు. అక్కడ ఒక క్రైస్తవ పాదరీని కలిశారు. తల్హా (రజి) మక్కావాసి అని తెలిసి ఆ పాదరీ ఆయనతో మాట్లాడుతూ 'నేను దైవగ్రంథాల అధ్యయనం చేసినవాణ్ణి కనుక మీ పట్నంలో ముహమ్మద్ (సఅసం) ప్రచారం చేస్తున్న ధర్మం సత్యమైనదని నేను నమ్మకంగా చెప్పగలను'' అని అన్నాడు. అంతటి తోనే ఆ విషయం ముగిసింది. హజ్రత్ తల్హా (రజి) తన వ్యాపార సామాగ్రి అమ్ముకొని మక్కా చేరిన తర్వాత ఈ విషయాన్ని తన మిత్రుడు హజ్రత్ అబూబకర్ (రజి)తో ప్రస్తావించారు. అప్పటికే హజ్రత్ అబూబకర్ (రజి) తాను ఇస్లాం స్వీకరించటమే గాక, ఇతరులకు కూడా దీన్ని బోధించసాగారు. ఆయన ఈమాట విని ఇలా అన్నారు: ''చూడు మిత్రమా! నిన్ను, నన్ను, సర్వప్రపంచాన్ని ఏకేశ్వరుడయిన అల్లాహ్యే సృష్టించాడు. భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, జంతువులు, వృక్షాలు అన్నింటినీ ఆయనే సృష్టించాడు. ఆయన సృష్టించిన వాతావరణంలోనే మనం శ్వాస తీసుకుంటున్నాము. ఆయన ప్రసాదించిన ఆహారమే మనం తింటున్నాము, ఆయన సృష్టించిన గాలి, సూర్యుడు, వర్షాల మూలంగానే మనం పంటలు పండించుకుంటున్నాము. అటువంటప్పుడు మనం కూడా ఆ ప్రభువును గుర్తించాలి. ఆయన్నే మన

యజమానిగా, స్వామిగా, ఆరాధ్యుడిగా స్వీకరించాలి. ఆయన ఆదేశాల ప్రకారమే చెడు విషయాల్ని మానేసి మంచి విషయాలను అవలంబించాలి. కాని అలాంటి అసాధారణ శక్తిసంపన్నుడయిన అల్లాహ్‌ను వదలి మన జాతి జనం రాళ్ళను పూజిస్తున్నారు. జూదం, మద్యంలోనే రాత్రింబవళ్ళు గడుపుతున్నారు. ముహమ్మద్ (సఅసం) దైవప్రవక్తగా ప్రజల ముందుకు వచ్చి అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, చెడ్డ పనులు మానేసి మంచి పనులు చేయడం అలవరచుకోవాలని ఉపదేశిస్తున్నారు. ఆ క్రైస్తవ పాదరీ నీతో చెప్పింది ముమ్మాటికి నిజం. ముహమ్మద్ (స) నిస్సందేహంగా దైవప్రవక్తే.'' ఈవిధంగా హజ్రత్ అబూబకర్ (రజి) దైవధర్మం గురించి వివరించిన తరువాత హజ్రత్ తల్హా (రజి)కు సత్యం ఏమిటో స్పష్టంగా అర్థమైపోయింది. వెంటనే ఆయన హజ్రత్ అబూబకర్ (రజి) వెంట మహాప్రవక్త (సఅసం) సన్నిధికి వెళ్ళి 'అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దైవం లేదు, ముహమ్మద్ (స) అల్లాహ్ పంపిన ప్రవక్త' అన్న సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించారు.

ఖాలిద్ బిన్ సయీద్ (రజి) జీవితం కూడా అలాగే ఉంది. ఈయన మక్కాలోని ఒక ఉన్నత కుటుంబానికి చెందిన యువకుడు, చదువు కున్నవారు. దైవవశాత్తు ఆయన ఒక కలగన్నారు. అందులో ఒక గుహలో భగభగ మండు తున్న అగ్ని ఉంది. ఆయన తండ్రి ఆయన్ని ఆ గుహలోకి నెట్టేస్తున్నాడు. కాని దైవప్రవక్త (స) ఆయన నడుం పట్టుకొని ఆయన్ని అందులో పడిపోకుండా వెనక్కి లాగుతున్నారు. ఈ కలతో ఆయన మనసు చెదిరిపోయింది. భయంతో లేచి కూర్చున్నారు. వెంటనే ఆయన తన స్నేహితుడు హజ్రత్ అబూబకర్ (రజి) వద్దకు వెళ్ళి తనకు వచ్చిన కల గురించి తెలిపారు. అందులోని మర్మం హజ్రత్ అబూబకర్ (రజి)కు అర్థమైపోయింది. అప్పుడాయన ఇలా అన్నారు: ''నీవు చూసిన కల యదార్థమైంది. కలలో నీవు చూసిన ఆ అగ్ని నరకాగ్ని. అందులో సందేహం లేదు. నీవే ఆలోచించు, రాతి దేవుళ్ళను మొక్కి, సారాతాగి, జూదం ఆడి, హత్యదౌర్జన్యాలు చేసి, నరకాగ్ని నుండి ఎలా తప్పించుకోగలవు. మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్తగా ప్రజల ముందుకు వచ్చి ఎప్పటినుండో సత్యసందేశాన్ని ప్రచారం చేస్తున్నారు.



అయినప్పటికీ మీ నాన్నగారు దీన్ని స్వీకరించలేదు. నీ కల ద్వారా కూడా ఆయన దీన్ని స్వీకరించరని తెలుస్తోంది. పైగా నిన్ను కూడా సత్యధర్మాన్ని స్వీకరించనీయకుండా అడ్డుపడి, తనతో పాటు నరకానికి తీసుకుపోదలిచాడు. కాని దైవప్రవక్త (స) నిన్ను నరకం నుండి కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. దైవసాక్షిగా చెబుతున్నా, నీవు ఏదోఒక రోజు ఈ ధర్మాన్ని స్వీకరించి తీరుతావు. అందుకని నా అభిప్రాయంలో నీవు ఇప్పుడే ఇస్లాం స్వీకరించటం మంచిది.'' (అల్ బరాయి-వా-3, పే-238/ హయాతుస్సహాబా వా-1, పే. 209 ఆధారంగా)

హజ్రత్ అబూబకర్ (రజి) ప్రోత్సాహంతో హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) మహాప్రవక్త (స) సన్నిధికి పోయి ''మీరు అందరికీ ఉపదేశిస్తున్న దేమిటి?'' అనడిగారు. దానికి దైవప్రవక్త (స) ''ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించమని చెప్తున్నాను. ఆయనే నిన్ను పుట్టించాడు. ఆయనే సమస్త అవసరాలు తీరుస్తున్నాడు. అందుకని విగ్రహాల్ని పూజించకు. నన్ను దైవప్రవక్తగా నమ్ము. ఎవరయితే నా మాట వింటాడో, అతను నరకాగ్నినుండి కాపాడబడతాడు'' అని చెప్పారు. హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) ఈ హిత బోధ వినగానే ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. ఇది హజ్రత్ అబూబకర్(రజి) సాధించిన ఘనకార్యం. (అల్‌బదాయి.వా-4, పేజి- 238 / హయా తుస్సహాబా.వా-1, పే.210 ఆధారంగా)

హజ్రత్ అబూబకర్ (రజి) సాధించిన ఇంకొక ఘనకార్యం ఉంది. బానిసలు ఇస్లాం ధర్మం స్వీకరించటం వలన వారి యజమానులు, వారిని నిర్దయగా కొట్టేవారు, అతి కిరాతకంగా హింసించేవారు. అలాంటి బలహీన బానిసల్ని వారి యజమానుల నుండి కొనుగోలు చేసి, దైవమార్గంలో స్వేచ్ఛగా ఉండటానికి స్వాతంత్రులుగా చేసేవారు హజ్రత్ అబూబకర్ (రజి).

ఇస్లాం ప్రారంభ కాలంలో ప్రతి వ్యక్తి తన విశ్వాసాన్ని గుప్తంగా ఉంచేవాడు. అవిశ్వాసులు వారిని హింసించకుండా ఉండేందుకు ప్రియప్రవక్త (స) కూడా ముస్లింలకు తమ విశ్వాసాలను దాచి ఉంచమని బోధించేవారు. ముస్లిమ్‌ల సంఖ్య ముప్పై తొమ్మిదికు చేరగానే హజ్రత్ అబూబకర్ (రజి) మహాప్రవక్త(స) వద్దకు వచ్చి, విశ్వాసాన్ని బహిరంగంగా ప్రకటించటానికి,

సత్యధర్మ ప్రచారానికి అనుమతి ఇవ్వమని అడిగారు. సత్యధర్మాన్ని బహిరంగంగా ప్రకటించగానే బహుదైవారాధకులు మండిపడతారని, వారంతా ఏకమై నిజధర్మాన్ని నిరోధించటానికి హింసాదౌర్జన్యాలకు పాల్పడతారని మహాప్రవక్త (స)కు తెలుసు. అందుకని ఆయన "అబూబకర్! ప్రస్తుతం ముస్లిమ్‌ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. బహుదైవారాధకుల నుండి వీరికి కష్టాలు వచ్చిపడతాయేమో! మరికొన్నాళ్ళు ఓపిక పట్టండి" అని చెప్పారు.

దానిపై హజ్రత్ అబూబకర్ (రజి) ఇలా అన్నారు. "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకర్పితమగుగాక! బహుదైవారాధకులు, అల్లాహ్ గృహంలో బహిరంగంగా మిథ్యాదేవుళ్ళను ప్రార్థిస్తున్నారు. మనమిక్కడ భూమ్యాకాశాలను సృష్టించిన ఆ నిజదేవుని పేరు కూడా ఎత్తవద్దంటే నాకు ఎంతో బాధగా ఉంది. " (బయానుల్ ఉమ్రా- తర్జుమా- తారీఖుల్- ఖులఫా, జలాలుద్దీన్ సుయూతి. పేజి.48)

హజ్రత్ అబూబకర్ (రజి) సందేశ ప్రచార ఉత్సాహం చూసి, చివరికి ప్రియప్రవక్త (స) ఆయనకు అనుమతిచ్చారు. తాను కూడా ఆయన వెంట కాబాగృహానికి వెళ్ళారు. ఆ సమయంలో కాబాగృహంలో ఖురైష్ నాయకులు చాలామంది ఉన్నారు. వారినుద్దేశించి హజ్రత్ అబూబకర్(రజి) ఇలా అన్నారు:

"ఖురైష్ నాయకులారా! మీరు పూజిస్తున్న ఈ రాతి విగ్రహాలు మీకెలాంటి లాభాన్నిగాని, నష్టాన్నిగాని కలిగించలేవు. మీరు అనవసరంగా వీటిముందు తలలు వంచి, వాటి ఔన్నత్యపు గీతాలు పాడి, మీ బ్రతుకులు పాడుచేసుకుంటున్నారు. ప్రశంసించటానికి, స్తుతించటానికి అర్హుడు అల్లాహ్ మాత్రమే. కాబట్టి మనమంతా అల్లాహ్‌నే ఆరాధించాలి. ఆయన్నే వేడుకోవాలి. ఆయన పంపిన దైవప్రవక్త ముహమ్మద్(స)ను విశ్వసిద్దాం రండి." (తారీఖుల్ ఖులఫా- జలాలుద్దీన్ సుయూతి- పేజి.48)

ఈ మాటలు వినగానే, మక్కా బహుదైవారాధకులు అగ్గిమీద గుగ్గిలం అయిపోయారు. ఒక్కసారిగా అందరూ లేచి హజ్రత్ అబూబకర్ (రజి) మీద విరుచుకుపడి కొట్టసాగారు. దాంతో ఆయన దేహం రక్తసిక్తమై పోయింది. అంతలో బనూ తమీమ్ తెగవారు ఈ విషయం తెలిసి కత్తులు ఝుళిపిస్తూ



అక్కడికి చేరుకున్నారు. వారిని చూడగానే దౌర్జన్యకారులు పలాయనం చిత్తగించారు. తరువాత బనూ తమీం తెగవారు రక్తసిక్తమయి పడివున్న హజ్రత్ అబూబకర్ (రజి)ను మోసుకొని ఆయన ఇంటికి తీసికెళ్ళారు.

ఆరోజు ఆయన సాయంత్రం వరకు స్పృహ లేకుండా పడిఉన్నారు. తరువాత స్పృహ రాగానే ముందుగా ప్రియప్రవక్త (స) పరిస్థితి ఏమిటని అడిగారు. ఆ తరువాత కాస్సేపటికి ప్రియప్రవక్త (స)ఉంటున్న 'దారె-అర్ఖమ్' నిలయానికి చేరుకొని ప్రియప్రవక్తను క్షేమంగా ఉండటం కళ్ళారా చూసుకొని సంతృప్తి చెందారు. దైవప్రవక్త ముఖంలో చిరునవ్వు చూసి బాధలన్నీ మరిచిపోయారు. దైవం కోసం, దైవప్రవక్త (స) కోసం ఆయన తన జీవితాన్ని పణంగా పెట్టారు. అందుకని తనపై జరిగిన దురాగతాలను ఆయన లెక్క చేయలేదు. బాధాకరమైన ఈ పరిస్థితిలో కూడా ఆయన తన తల్లిని గురించి ఆలోచిస్తూ ఇస్లాం స్వీకారభాగ్యం తన తల్లికి కూడా ప్రసాదించమని దేవుణ్ని ప్రార్థించమని దైవప్రవక్త (స)ను అడిగారు. ఆయన కోరికపై దైవప్రవక్త (స) చేతులెత్తి దేవుణ్ని ప్రార్థించారు. ఆ తరువాత దేవుడు హజ్రత్ అబూబకర్ (రజి) తల్లికి ఇస్లాం స్వీకారభాగ్యం ప్రసాదించాడు.

హజ్రత్ అబూబకర్ (రజి)లోని సందేశ ప్రచార ఆసక్తి చూడండి. అవిశ్వాసులు కొట్టిన దెబ్బలకు దేహం పచ్చిపుండయి రక్తం కారుతున్నది, చాలా సేపటికి స్పృహ వచ్చింది, ఎంతో నీరసించారు అలాంటి స్థితిలో కూడా ఆయన కోరుతున్నదేమిటి? దైవప్రవక్త (స)ను దర్శించుకోవటం, ఆయన యోగక్షేమాలు తెలుసుకోవటం. ఇంకా బహుదైవారాధనలో మునిగి ఉండి నరకాగ్నికి సమిధ కానున్న తన తల్లి ఇస్లాం స్వీకారభాగ్యం పొంది నరకాగ్ని నుండి రక్షింపబడాలనే తపన. ఇదీ ఆయన జీవనసరళి.

దైవదాస్యమే ఇస్లాంకు మారుపేరు. ఈ మార్గం ద్వారానే మానవుని ఆత్మకు శాంతి స్థిమితాలు ప్రాప్తమవుతాయి. అయితే ఇస్లాం బోధనలు తెచ్చిన దైవప్రవక్త ఇహలోకం వీడిపోతున్నప్పుడు ఆయన అనుచరులు ఎంత తల్లడిల్లిపోయారో అందరికీ తెలిసిందే. మహాప్రవక్త (స) పరమపదించిన సమయంలో ఆయన అనుచరుల ఆందోళన, ఆవేదనలు చెప్పనక్కరలేదు. అలాంటి

పరిస్థితిలో కూడా హజ్రత్ అబూబకర్ (రజి) గుండె దిటవు చేసుకొని దుఃఖాన్ని ఆపుకుంటూ ఇతరులకు ధైర్యం చెప్పారు. వారిని ఆయన ఓదారుస్తూ ఇలా అన్నారు:

''బాగా వినండి, ఎవరయితే ముహమ్మద్ (స)ను అనుసరించేవారో, ముహమ్మద్(స)ఈ ప్రపంచాన్ని వీడారని తెలుసుకోవాలి. ఎవరయితే అల్లాహ్ దాస్యాన్ని చేసేవారో, అల్లాహ్ సజీవంగా ఉన్నాడని, ఆయనకెప్పుడూ మృత్యువు రాదని తెలుసుకోవాలి.'' (ఇస్లామీయ చరిత్ర- షామొయినుద్దీన్ నద్వీ-వా-1 పేజ.106)

విషయం అర్థం చేసుకునేవారికి ఇదొక సందేశం. ఏ దేవుడయితే, ముహమ్మద్ (స)కు సన్మార్గ సందేశమిచ్చి పంపించాడో, ఆయన సజీవంగా ఉన్నాడు, ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటాడు. ఆయన పంపిన సందేశం కూడా చెక్కుచెదరకుండా ఉంది, ఇకముందు కూడా అలాగే ఉంటుంది. కాబట్టి మీరు నిరాశానిస్పృహలకు గురికాకుండా శాశ్వతంగా ఉండే ఆ దైవాన్నే ఆరాధిస్తూ, ఆయన సందేశప్రచారాన్ని జీవితలక్ష్యంగా చేసుకోవాలి. ఆయన ప్రవక్త (స) సందేశ ఉద్యమాన్ని కొనసాగించాలి.

హజ్రత్ అబూబకర్ (రజి) నోట ఈ మాటలు వినగానే అందరి మన సులు కుదుటపడ్డాయి. తరువాత ప్రశాంతంగా దైవప్రవక్త (స) భౌతికకాయాన్ని ఖననం చేయడం జరిగింది.

ఆ తరువాత ముస్లింలందరూ హజ్రత్ అబూబకర్ (రజి)ను ప్రవక్త వారసునిగా, మొదటి ఖలీఫాగా ఎన్నుకున్నారు. (ఖలీఫా అంటే ప్రతినిధి- ఖలీఫాయె రసూల్ అనగా దైవప్రవక్త ప్రతినిధి అని అర్థం.) ఖలీఫాగా ఎన్నుకో బడిన తరువాత ఆయన ఇలా ఉపన్యాసమిచ్చారు.

''నేను ఇస్లామీయ రాజ్యవ్యవహారాలను అల్లాహ్ ఆదేశాలనుసారం, దైవప్రవక్త(స) నేర్పిన పద్ధతిలో నడిపిస్తాను. నేను ఈ విధంగా వ్యవహారాలను నడిపితే నాతో సహకరించండి. దీనికి భిన్నంగా ప్రవర్తిస్తే నా మాట వినకండి.'' (ఇస్లామీయ చరిత్ర- షామొయీనుద్దీన్ నద్వీ- వా.1 పే.120)



ఆ తరువాత ఆయన నమాజ్, జిహాద్‌లను గురించి ఉపదేశించారు. సత్కార్యాలను ఆచరించటానికి పురిగొల్పారు. ఏ జాతి అయితే అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయదో, దైవం ఆ జాతిని అవమానపరుస్తాడు. ఎవరయితే చెడు కార్యాలు చేస్తారో, దైవం వారిని ఆపదల్లో పడవేస్తాడు. హజ్రత్ అబూబకర్ (రజి) పరిపాలనా (ఖిలాఫత్) కాలంలో ముసైలిమా అనే ఒక అసత్యవాది తాను కూడా ఒక దైవప్రవక్త అని ప్రకటించుకున్నాడు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో తిరుగుబాటు (ఇస్లాం నుండి తిరోగమనం) ధోరణి తలెత్తింది. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) సమయస్ఫూర్తిగా స్పందించి, ఆ అసత్య ప్రవక్త, అతని అనుచరమూకతో యుద్ధం చేశారు, ముసైలిమా వధించ బడ్డాడు. ఈవిధంగా దేవుడు ఇస్లాం ధర్మాన్ని బలోపేతం చేశాడు.

హజ్రత్ అబూబకర్ (రజి) జకాత్ ఇవ్వ నిరాకరించినవారితో యుద్ధాలు చేసి, ఉధృతంగా లేవబోతున్న ఒక దుర్మార్గాన్ని నిర్మూలించగలిగారు. ఆయన ఏదయినా ప్రాంతానికి సైన్యం పంపిస్తున్నప్పుడు, ఆ సైన్యాధికారికి ఇలా హితబోధ చేసేవారు. ''వాగ్దానం చేస్తే, దాన్ని తప్పక నెరవేర్చాలి, పిల్లల్ని, వృద్ధుల్ని, స్త్రీలను హతమార్చరాదు, అసత్యం పలకకూడదు. ఏ వస్తువునూ అన్యాయంగా తీసుకోరాదు. ఎవరిని కలిసినా గౌరవించాలి. యుద్ధానికి ముందు విషయాన్ని విశదీకరించాలి. దైవసందేశాన్ని అందజేయాలి. ఇతర మతాలకు చెందిన వ్యక్తులను వారికి సంబంధించిన ఆరాధనాలయాల్లో ప్రార్థన చేస్తున్నప్పుడు మందలించకూడదు. వారి మీద చేయి చేసుకోరాదు. దైవప్రవక్త (స) ఆదేశించిన విషయాలన్నిటిని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలి.'' ఇలాంటి సద్భావనల వల్లనే తూర్పు పడమరల్లో ఇస్లాం ప్రభంజనం వీచింది. దైవాన్ని విస్మరించిన జనులు, దైవంతో సంబంధం ఏర్పరుచుకున్నారు.

# 2. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)

ఇస్లామ్ అల్లాహ్ పంపిన ధర్మం. అవిశ్వాసం దైవద్రోహానికి మారుపేరు. ఇస్లామ్ మానవుల్ని అల్లాహ్ దాస్యం వైపు పిలుస్తుంది. షైతాన్ దైవద్రోహం

వైపుకు పురిగొల్పుతాడు. మానవుడు ఈ రెండింట్లో ఒక మార్గాన్ని మాత్రమే అవలంబించవలసి ఉంటుంది. మానవునిపై దేవుని కారుణ్యం ఉంది కనుకనే ఆయన తన ప్రవక్తల ద్వారా మానవులకు సన్మార్గం చూపించాడు. దైవదాసుడుగా జీవితం గడిపినప్పుడే మానవుడు ఇహపరాల్లో సాఫల్యం పొంద గలుగుతాడు. ఈ విషయం తెలుపటానికే మహాప్రవక్త ముహమ్మద్ (స) వచ్చారు. ఆయనకు పూర్వం వచ్చిన ప్రవక్తల బోధనల్ని ప్రజలు విస్మరించారు. దైవదాస్యం ప్రపంచం నుండి కనుమరుగైపోయింది, మానవుడు తన ఉన్నత స్థానం నుండి దిగజారిపోయాడు. షైతాన్ వలలో చిక్కుకుని భూమ్యాకాశా లను, సూర్యచంద్రులను, చెట్లను, గుట్టలను, నీటిని, నిప్పును- ఒకటేమిటీ, యావత్తు సృష్టిని పూజించసాగాడు.

ఇలాంటి వాతావరణంలో మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రభవించి మానవుని అసలు స్థానమేమిటో ప్రజలకు తెలిపారు. యావత్తు సృష్టికి కర్త ఒకే దేవుడని, భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, చెట్లు, గుట్టలు అన్నిటినీ ఆయనే సృష్టించాడని, కనుక మనం ఆయన్ని మాత్రమే ఆరాధించాలని, జీవితంలోని సకల రంగాల్లో ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలని బోధించారు.

మనోవాంఛలకు బానిసలయి ప్రాపంచిక వ్యామోహంలో మునిగి పోయిన అరబ్బులు ఈ ఏకేశ్వరనినాదం విని ఉలిక్కిపడ్డారు. ఆ తరువాత ఇస్లాంకు, దైవప్రవక్త (స)కు వ్యతిరేకులైపోయారు. ప్రేమ ద్వేషంగా మారిపోయింది. నిన్నటి వరకు ప్రాణత్యాగానికి సైతం వెనుకాడనివారు నేడు బద్ధశత్రువులైపోయారు. తల్లిదండ్రులే తమ సంతానాన్ని ఇస్లాం స్వీకార నేరానికి ఇంటి నుండి గెంటివేశారు. భార్య తన భర్త దౌర్జన్యానికి గురి కావలసి వచ్చింది. బంధువులు తమ ఆప్తులకు పరమ కిరాతకులుగా మారిపోయారు.

ఒక రోజు మక్కానగర పెద్దలంతా ఒక సభ ఏర్పాటుచేసి మహాప్రవక్త ముహమ్మద్ (స)ను హతమార్చటానికి యువకులను ప్రోత్సహించసాగారు. ఆ సమయంలో అక్కడ హజ్రత్ ఉమర్(రజి) కూడా ఉన్నారు. ఆయన శరీరం లోని యువరక్తం కుతకుతలాడి పోయింది. తానొక్కడే ఈ బెడదను శాశ్వతంగా కడతేర్చుతాను అంటూ ఆవేశంతో ఖడ్గం తీసుకొని, దైవప్రవక్త(స) ఇంటివైపుకు



బయలుదేరారు. త్రోవలో హజ్రత్ నయీమ్ బిన్ అబ్దుల్లా కలిశారు. ఆయన హజ్రత్ ఉమర్ చేతిలో వరలేని ఖడ్గాన్ని, ఆయన హావభావాలను చూసి, ఇతని ఉద్దేశమేమై ఉంటుందో గ్రహించారు. "ఉమర్! ముందు నీ ఇంటి విషయం చూసుకో. నీ చెల్లి, బావ ఇద్దరూ ఇస్లామ్‌ను స్వీకరించారు" అన్నారు ఆయన. ఇది వినగానే హజ్రత్ ఉమర్ కోపంతో కంపించిపోయారు. ఈ క్రోధావేశాల్తోనే ఆయన చెల్లి ఇంటికి వెళ్ళి, చెల్లెల్ని, ఆమె భర్తను కసితీరా కొట్టారు. ఆయన కొట్టిన దెబ్బలకు చెల్లెలికి గాయాలై రక్తం ప్రవహించసాగింది. ఆమె ఏడుస్తూ "ఉమర్! నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. కాని మేమైతే ఇస్లామ్‌ను విడనాడేది లేదు." అని తెగేసి చెప్పేసింది. ఇది విని హజ్రత్ ఉమర్ సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయాడు. ఇస్లాం స్వీకరించగానే మనిషిలో ఇంత మార్పా? ఇంత దృఢత్వమా? హజ్రత్ ఉమర్ ఆలోచనలో పడిపోయారు. కొట్టటం మానేసి, "సరే! మీ ప్రవక్తపై అవతరించిన ఆ ఖుర్‌ఆన్ కాస్త వినిపించండి" అని అన్నారు. వీరిద్దరూ ఖుర్‌ఆన్‌లోని కొంత భాగాన్ని చదివి వినిపించారు. అది విన్నకొద్దీ, హజ్రత్ ఉమర్ కళ్ళపై ఏర్పడిన అజ్ఞానపు పొరలు తొలగిపోసాగాయి. ఆయన హృదయం కరిగిపోయింది. అదే సమయంలో, అదే స్థితిలో మహాప్రవక్త(స) దగ్గరికి వెళ్ళి ఇస్లాం స్వీకరించారు.

ఇస్లాం స్వీకరించటమంటే ఒక గొప్పవిప్లవానికి నాంది. ఒక మనిషి ఇస్లాం స్వీకరించగానే, అతనిలో సమూలంగా మార్పు వచ్చేస్తుంది. దీన్ని బహి రంగంగా ప్రకటించి, సత్యాసత్యాలలోని వ్యత్యాసాన్ని బహిర్గతం చేయాలని అతని మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. అంతేకాదు, తన హృదయంలో, తన వ్యక్తిత్వంలో, తన జీవితంలో ఏ మార్పు, ఏ విప్లవం సంభవించిందో, ఇతరులు కూడా దాన్ని ఆస్వాదించాలని అతను కోరుకుంటాడు. బహుశ ఈ మార్పును చూసి నిద్రావస్థలోనున్న ప్రజానీకం మేల్కొంటుందేమోనని అతని ఆశ. ఈ భావనలే హజ్రత్ ఉమర్ హృదయంలో మెదలసాగాయి. అందుకని ఆయన మహాప్రవక్త(స)తో, "పదండి, మనమంతా కలిసి కాబా గృహంలో సామూ హికంగా నమాజ్ చేద్దాం" అని అన్నారు. ఆనాటి వరకు ఏ ముస్లింకు కూడా కాబాగృహంలో నమాజు చేసే ధైర్యంలేదు. అలాంటి ఆలోచన కూడా ఎంతో

ధైర్యసాహసాలతో కూడిన ఆలోచనగా భావించబడేది. దీనికి కారణం కూడా లేకపోలేదు. మక్కావాసులు ఎంతటి శతృత్వం వహించారంటే కాబాలో నమాజ్ చేయటం రక్తపాతాలకు దారి తీసేంత తీవ్రంగా కనబడేది. అయితే అల్లాహ్ ఉనికి, ఆయన భావన, ఏ మనిషి మనో మస్తిష్కాలలో పూర్తిగా జాగృతమవు తుందో, అతని హృదయం నుండి అన్నిరకాల భయాందోళనలు దూరమయి పోతాయి. విశ్వాసజ్వాల అతనిలో ఎంతటి ధైర్యసాహసాలను పెంపొందిస్తుం దంటే, మృత్యువును సైతం అతను ఖాతరు చేయడు.

హజ్రత్ ఉమర్‌లోని ఈ విశ్వాస పరిణతిని చూసి మహాప్రవక్త(స) కూడా దీనికి సిద్ధమయ్యారు. అక్కడున్న వాళ్ళంతా కలిసి కాబాగృహానికి వెళ్ళి నమాజ్ చేశారు. అవిశ్వాసులు రాతిబొమ్మల్లా తదేకంగా చూస్తుండిపోయారు. వీరి దగ్గరికి రావటానికి కూడా వారికి ధైర్యం చాల్లేదు. హజ్రత్ ఉమర్ ప్రదర్శించిన ఈ అసామాన్య ధైర్యస్థైర్యాలు ఆచంద్రతారార్కము ప్రపంచం మరువజాలదు. సత్యజ్యోతి ఆరిపోవటానికి ఓడిపోవటానికి రాలేదని, దాని తేజోమయ కిరణాలు అవిశ్వాస చీకట్లను పారద్రోలేంత వరకు ఊరుకోవని, పిరికి అవిశ్వాసులకు హజ్రత్ ఉమర్ తన చర్య ద్వారా హెచ్చరించారు.

హజ్రత్ ఉమర్ సద్వచనం పఠించి దైవధర్మం విశ్వసించిన రోజు నుండి ఇస్లాం రహస్య ప్రచారఘట్టం ముగిసిపోయింది. అంతకుముందు వరకు ముస్లింలు బహిరంగంగా ఆరాధన చేయటంగాని, ఇస్లాం ప్రకటనగాని చేయలేకపోయేవారు, కాబా ప్రదక్షిణ కాదు కదా, అందులో ప్రవేశించటానికి కూడా వారికి అనుమతి లేదు. కాని హజ్రత్ ఉమర్ ఇస్లాం స్వీకరించగానే, ముస్లింలపై కమ్ముకొని ఉన్న దైన్యం, భయాందోళనల కారుమేఘాలు వీడి పోయాయి. ఆయన అజ్ఞానకాలంలో కూడా గొప్పవీరుల్లో పరిగణింపబడే వారు. ఆ కాలంలో కూడా ఆయన ఎవరికీ భయపడేవారు కాదు. ఇక ఇప్పుడు ఏకేశ్వరవాది అయ్యాక ఆయనలోని శక్తిసామర్థ్యాలు, బలపరాక్రమాలు ద్విగుణీకృతమయ్యాయి. అందుచేత ఆయన అవిశ్వాసులను లెక్కచేసేవారే కాదు. అవిశ్వాసులు ఎవరయినా ముస్లింపై హింసాదౌర్జన్యాలకు పూనుకుంటే, ఆయన ఆ ముస్లింకు అండగా నిలబడేవారు.



ఆరాధనకోసం ప్రజలు ఒకచోట సమావేశమవటానికి సంకేతంగా ఆ కాలంలో గంటా కొట్టటమో లేక శంఖం ఊదటమో జరుగుతుండేది. అయితే ఇస్లాంలోని ఏకేశ్వరభావన అన్ని విశ్వాసాల్లోకెల్లా అపూర్వమైన మహోన్నతమైన విశ్వాసం, అదే విధంగా దీని సందేశప్రచార సరళి కూడా అన్నిటికీ భిన్నంగా ఉంది. భౌతిక వస్తువులను ఆధారంగా చేసుకోవటానికి బదులు ఆధ్యాత్మిక దృక్పథం, ఆత్మపరిశుద్ధతకు ప్రాధాన్యతనిస్తుంది. ముస్లింలను సమావేశపరచ టానికి ఏ పద్ధతి అవలంబించాలి అనే అంశంపై మహాప్రవక్త (స) సభలో చర్చ జరిగింది. ఆ కాలంలో ప్రజలను సమావేశపరచటానికి శంఖాన్ని ఊదటం, గంటాలను మ్రోగించటమే ఆనాటి ప్రజలకు తెలుసు కనుక వారు ఇలాంటి ప్రతిపాదనలనే చేశారు. అయితే దైవప్రవక్త (స)కు ఈ పద్ధతులేవీ నచ్చలేదు. ఇంతలోనే హజ్రత్ ఉమర్ వచ్చారు. దేన్నిగురించి చర్చిస్తున్నారని అడిగారు. దైవప్రవక్త (స) ప్రజలు సూచించిన ప్రతిపాదనల్ని హజ్రత్ ఉమర్‌కు తెలిపారు. దానిపై హజ్రత్ ఉమర్ ఇలా చెప్పారు. "దైవప్రవక్తా! రాత్రి నేనొక కల గన్నాను. అందులో ఒక వ్యక్తి నమాజ్‌కు ముందు ఈవిధంగా పిలుస్తున్నాడు- అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్- అష్‌హదు అన్‌ల్లాఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ గొప్పవాడు, అల్లాహ్ గొప్పవాడు- అల్లాహ్ తప్ప వేరెవ్వరూ దైవం లేరని నేను సాక్ష్యమిస్తున్నాను)" హజ్రత్ ఉమర్ ఈ విషయం చెప్తుండగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి "ఈ కల మేము కూడా చూశాము" అని చెప్పారు. ఇది విని దైవప్రవక్త (స) సంతృప్తి చెందారు. ఆయన హజ్రత్ బిలాల్ (రజి)ను పిలిచి ప్రజలు మస్జిద్‌కు రావటానికి పిలుపుగా నమాజ్‌కు ముందు ఈ వాక్యాలు బిగ్గరగా పలకాలని ఆదేశించారు.

అజాన్ పిలుపుకు సంబంధించిన ఈ వాక్యాలు ఒకవిధంగా మిథ్యా దైవాలకు వ్యతిరేకంగా ఒక యుద్ధభేరి లాంటిది. అయితే దీని పర్యవసానం కూడా కఠినంగానే బయల్పడింది. అవిశ్వాసులు మరింత కాఠిన్యానికి ఒడిగట్టారు. ఇస్లాం స్వీకరించిన ప్రతి మనిషిపై దుర్భర దౌర్జన్యకాండకు పాల్ప డ్డారు. అయితే ఖుర్‌ఆన్ సందేశం ఎవరి హృదయాల్లోనైతే గాఢంగా నాటుకు పోయిందో వారు హింసాదౌర్జన్యాలను ఓరిమితో, చిరునవ్వుతో స్వీకరించారు.

శత్రువులు అడుగడుగునా హింసించ సాగారు. కాని విశ్వాసులు మాత్రం వెనుకంజ వేయకుండా ముందుకే సాగుతూపోయారు. వారు రకరకాల కష్టనష్టాలను, హింసాదౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ఇల్లువాకిలి విడిచిపెట్టాల్సి వచ్చింది, యుద్ధాలకు దిగాల్సి వచ్చింది. కాని వారి ధీరత్వం, వారి దృఢత్వంలో ఎలాంటి బలహీనత ఏర్పడలేదు, చివరకంటూ వారు తమ ప్రియ విశ్వాసాలపై దృఢంగా నిలబడ్డారు. ఈ ఘట్టాలన్నీ హజ్రత్ ఉమర్ కూడా అధిగమించారు. ఆయన 33వ ఏట ప్రవేశించారు. అప్పుడు హిజ్రత్ (వలస) ఆదేశం వచ్చింది. పట్నం వదలి, వలస వెళ్ళండనే ఆదేశం లభించగానే హజ్రత్ ఉమర్ దీనికి సంసిద్ధులయ్యారు. ఎక్కడయితే తన చిన్నప్పటి జ్ఞాపకాలున్నాయో ఏ పట్నం లోని వీధులు, రోడ్డులు తనకు సుపరిచితమో ఏ గుట్టలు, మిట్టలతో తనకు విడదీయలేని ప్రేమానుబంధాలున్నాయో, ఆ పట్నాన్ని వదలి వలస వెళ్ళా ల్సిందిగా దైవాజ్ఞ అయింది. దైవాజ్ఞముందు వీటి విలువెంత? ఆయన అల్లాహ్ సిపాయి. అల్లాహ్ ప్రసన్నతే ఆయన జీవిత లక్ష్యం.

ఈ హిజ్రత్ లేక వలసవెళ్ళటానికి కూడా మక్కా వాసులు ముస్లింలకు అనుమతి ఇవ్వలేదు. వారెంతగా భయోత్పాతాన్ని సృష్టించారంటే, ముస్లింలు ఎవరికీ తెలియకుండా వేరొక ప్రాంతానికి వలస వెళ్ళటానికి అశక్తులయి పోయారు. అందుకని వారు రహస్యంగా ఒక్కొక్కరు ఇద్దరేసి చొప్పున మక్కా వదలిపోసాగారు. హిజ్రత్ సమయంలో హజ్రత్ ఉమర్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు చరిత్రాత్మకమైనవి. ఆయన హిజ్రత్ గురించి హజ్రత్ అలీ (రజి) ఇలా వ్యాఖ్యానించారు:

"నాకు తెలిసినంత వరకు ఒక్క హజ్రత్ ఉమర్ తప్ప మిగిలిన ముస్లిం లందరూ రహస్యంగానే మక్కా నుండి వలస వెళ్ళారు. హజ్రత్ ఉమర్ హిజ్రత్ చేయడానికి నిర్ణయించుకోగానే నడుముకు ఖడ్గం వ్రేలాడదీసి, భుజానికి ధనస్సు తగిలించుకొని, చేతిలో బాణం పట్టుకొని కాబాగృహంలో ప్రవేశం చారు. అప్పుడు కాబాలో ఖురైష్ నాయకులు ముచ్చట్లాడు కుంటున్నారు. ముందుగా ఆయన కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. ముఖామె ఇబ్రాహీం వద్ద రెండు రకాతుల నమాజ్ సలిపారు. ఆ తర్వాత ఖురైష్



నాయకుల వద్దకు వెళ్ళి ఇలా అన్నారు. "మీ ముఖాలు నల్లబడుగాక! మీలో ఎవడైతే తన సంతానాన్ని అనాథలుగా, తన భార్యను విధవరాలిగా చేయ దలచుకున్నాడో అతను నన్నడ్డుకోవడానికి పట్నం వెలుపల నన్ను కలుసుకో వచ్చు." (ఇస్లామీయ చరిత్ర- అక్బర్‌షా నజీబాబాది-వా.1 పేజి-311)

అయితే మక్కాలోని ఏ ఒక్క మనిషి కూడా ఆయన్ను అడ్డుకోవడానికి సాహసించ లేకపోయాడు.

దైవమార్గంలో హజ్రత్ ఉమర్ ఎన్నడూ తటపటాయించలేదు. ప్రతి పరీక్ష సమయంలో ఆయన సత్యంపై దృఢంగా నిలిచారు. ఆయన తన సర్వ స్వాన్ని అల్లాహ్‌కు అర్పించుకున్నారు. ఆయన బాధపడినా, సంతోషపడినా సర్వం అల్లాహ్ కోసమే. అల్లాహ్‌ను ప్రేమిస్తూనే జీవిస్తాను. అల్లాహ్ మార్గంలోనే ప్రాణాల్ని ఒదులుతానని ఆయన దృఢనిర్ణయం చేసుకున్నారు. తనకు తోడుగా అల్లాహ్ ఉన్నాడనే దృఢవిశ్వాసం ఆయనలో ఉంది. కనుకనే ఆయన మక్కా అవిశ్వాసులకు ఏమాత్రం లొంగలేదు.

చివరికి మక్కా జయించబడిన రోజూ వచ్చింది. అవిశ్వాసుల శక్తి సామర్థ్యాలు ఉడిగిపోయాయి. యావత్తు అరేబియాలో ఇస్లాం ఒక బలీయమైన శక్తిగా ఆవిర్భవించింది. ఆ సమయంలోనే ఇస్లామీయ రాజ్యస్థాపన జరిగింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆ రాజ్యాన్ని ఏలి చూపించారు. ఆయన (స) తరువాత హజ్రత్ అబూబకర్ ఖలీఫా అయ్యారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్ ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు.

దైవం మానవులందరినీ ఒకేవిధంగా పుట్టించలేదు. వారిలో లెక్క లేనన్ని వ్యత్యాసాలు కనబడతాయి. కొందరు అందంగా ఉంటే, కొందరు కురూపులుగా ఉంటారు. కొందరు బలిష్టంగా ఉంటే కొందరు బలహీనంగా ఉంటారు. కొందరికి శారీరక దృఢత్వం ఇవ్వబడితే, కొందరికి బుద్ధికుశలత ఒసంగబడ్డది. అయితే ఈ భేదాలు, వ్యత్యాసాలపైనే మానవ సమాజ మనుగడ సాగుతున్నది. కాని తమ తమ కాలాల ఫిర్ఔన్లు, నమ్రూద్‌లు, అధికారాన్ని పొంది విర్రవీగిపోయారు. బలహీనుల జీవితాల్ని దుర్భరం చేసారు. దీనికి కారణం తమకు లభించిన అధికారం తమ బాహుబలాల ఫలితమని వారు

భావిస్తారు. అయితే వీరికి భిన్నంగా సజ్జనులైన దైవదాసులకు దేవుడు రాజ్యాధికారం ప్రసాదిస్తే దీన్ని వారు దైవానుగ్రహంగా భావించి వినమ్రతను పాటిస్తారు. కృతజ్ఞతా పూర్వకంగా దేవుని ముందు మోకరిల్లుతారు. వీలైనంత ఎక్కువగా ప్రజలకు సేవచేస్తూ, దైవసందేశ ప్రచారంలో నిమగ్నమవుతారు.

హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (స) సహచర్యంలో శిక్షణ పొందారు. దేవుడు ఆయనకు సునిశితదృష్టి, కార్యదక్షత, మంచి తెలివితేటలు ప్రసాదించాడు. మానవుడు ఇహంకన్నా పరలోకంపైనే దృష్టి పెట్టి జీవించాలి. ఇహం అశాశ్వితం, పరలోక జీవితం శాశ్వతమైనది కనుక పరలోక సాఫల్యానికే ప్రాధాన్యతనివ్వాలి. సృష్టికర్తకు భయపడుతూ తనకు లభించిన రాజ్యాధికారం దేవుడు అప్పగించిన అమానతుగా భావించి, ప్రజల శ్రేయస్సు, పరలోక సాఫల్యాలనే ఆయన ధ్యేయంగా పెట్టుకున్నారు. ఆయన చేసిన ఒక ప్రసంగంలో ఈ విషయమే తెలుస్తుంది.''

''మానవులపై దైవానికున్న హక్కుల్ని, విధుల్ని వారు సక్రమంగా నెరవేరుస్తున్నారా?లేదా? అనే విషయంపై ఒక పాలకుడు అత్యధికంగా శ్రద్ధచూపాలి. దైవం తన విధేయత కోసం ఏ ఆదేశాలైతే ఇచ్చాడో, వాటినే మనం ఆదేశించాలి. ఏ అవిధేయత నుండి వారించాడో వాటి నుండి ఆపాలి.''

ప్రపంచవానుల్ని చెడునుండి వారించి, మంచి పనులకు ప్రేరేపించటమే పై వాక్యాల అర్థం కదా! దైవప్రవక్త (స) అమ్ర్ బిన్ హిజమ్ (రజి)ను యమన్ పాలకునిగా పంపుతూ హజ్రత్ ఉమర్ ఇలా ఆదేశించారు-

''అల్లాహ్ ఆదేశించినట్లు సత్యంపై దృఢంగా నిలవాలి. ప్రజల మేలుకు సంబంధించిన శుభవార్తను అందించి, సత్కార్యాలకు ఆదేశించాలి. ప్రజలకు ఖుర్ఆన్ విద్యను నేర్పాలి. వారిలో దీన్ని అర్థం చేసుకొనే స్థోమతను కలగించాలి. వారిని సంతృప్తులుగా చేయాలి, తత్ఫలితంగా వారు ధర్మంవైపుకు మరలుతారు.''

పై ఆదేశాన్ని దృష్టిలో పెట్టుకొని హజ్రత్ ఉమర్ ఒకసారి ఇలా అన్నారు: ''ఓ దేవా! నా సమస్త అధికారుల్ని, ప్రజలకు వారి ధర్మం, వారి ప్రవక్త (స)



ఆచరణ(సున్నత్)కు సంబంధించిన జ్ఞానం గరపటానికే నియమించాననే విషయానికి నిన్ను సాక్షిగా చేస్తున్నాను.''

సాధారణంగా మానవ సమాజాల్లో మానవోపకారులుగా గుర్తించబడేవారు, మానవుల ప్రాపంచిక జీవితానికి సంబంధించిన ప్రయోజనాలనే దృష్టిలో ఉంచుకొని పనిచేస్తారు. ఆర్థికాభివృద్ధి, విద్యాభివృద్ధి, లేక సంఘాభివృద్ధి వరకే వారి దృష్టి పరిమితమై ఉంటుంది. కాని హజ్రత్ ఉమర్ దృష్టి వేరు. దైవదాసులకు దైవసందేశం చేరవేయటం ప్రథమంగా గుర్తించబడేది. ఎవరయితే వీరిని పుట్టించాడో ఎవరి వైపుకైతే వీరు తిరిగి వెళ్ళాల్సిఉందో, ఆ ప్రభువును ప్రజలు మరిచిపోకుండా ఉండేందుకే సర్వసాధనాలు ఉపయోగించబడేవి. రాష్ట్రాల, ప్రాంతాల అధికారుల నియామకం కూడా దీన్నుండి మినహాయింపు లేదు. అందుకే ఒక ప్రాంతానికి ఒక అధికారిని నియమించి పంపేటప్పుడు ఆ ప్రాంతవాసుల నుద్దేశించి ఆయన ఇలా చెప్పేవారు:

''నేను మీపై అధికారులను నియమించి పంపిస్తున్నది మిమ్మల్ని హింసించటానికి, మీ సొత్తును అక్రమంగా లాక్కోవటానికి కాదు. వారు మిమ్మల్ని ధార్మికంగా సుశిక్షుతులు చేయాలని, మన ప్రవక్త (స) ఆచరణ పద్ధతులను తెలుపాలనే వారిని పంపిస్తున్నాను. దీనికి భిన్నంగా వారు ఏదైనా అన్యాయానికి ఒడిగడితే నా దృష్టికి తీసుకురండి, వారి నుండి మీకు నష్ట పరిహారం ఇప్పిస్తాను.'' (అల్‌ఫారూఖ్- షిబ్లినొమాని- పేజి. 140)

ఈ విధంగా హజ్రత్ ఉమర్ (రజి) తన పాలనా కాలంలో ఇస్లామీయ ప్రభుత్వ తరహానే మార్చివేశారు. దీని ఫలితంగా ఇస్లామీయ ధర్మం కేవలం ఒక సిద్ధాంతంగా, ఒక విశ్వాసంగానే ఉండిపోలేదు, అది ప్రజల మస్తిష్కాలపై సైతం రాజ్యమేలసాగింది. ఈ కారణంగానే ఇస్లాం శీఘ్రంగా వ్యాపించసాగింది. ఎప్పుడయినా, ఎక్కడికయినా సైన్యాన్ని పంపవలసి వస్తే, ఆ సైన్యాధికారిని సంబోధిస్తూ, 'మీ పని కేవలం యుద్ధం చేయటమే కాదు, ఇస్లాం సందేశం అందజేయటం కూడా మీ విధే''. హజ్రత్ సాద్ బిన్ వఖాస్ (రజి)ను ఈరాన్ సైన్యాలను ఎదుర్కోవటానికి పంపించే ముందు ఈ విధంగా ఉపదేశించారు: ''యుద్ధానికి ముందు శతృవులకు సత్యసందేశాన్ని వినిపించండి. ఈ విశ్వాన్ని

సృష్టించినవాడు ఒకే ఒక దైవమని, ఆయనే అందరినీ పుట్టించాడని, తన సృష్టితాల పట్ల ఆయన అత్యంత దయగలవాడని, అందుకని మానవుడు కూడా ఆయన ముందే తలవంచాలని, ఆయన్నే ఆరాధించాలని, ఆయనే తనకిష్టమైన జీవన విధానం తెలుపటానికి మానవుల దగ్గరకు మహాప్రవక్త ముహమ్మద్ (స)ను పంపాడని, దైవం ఏ విషయాలతో సంతృప్తుడవుతాడు, ఏ విషయాలతో అసంతృప్తుడవుతాడు, దైవసమ్మతమైనదేది, దైవ నిషేధితమైన దేది అనే విషయాలు ఆయన మనకు తెలిపారని, ఈ విషయాలను మీరూ అవలంబిస్తే మీతో మాకెలాంటి శతృత్వం లేదని వారికి తెలియపరచండి."

ఇదేవిధంగా ఏ దేశమైన జయించబడితే లేక ప్రజలు అధికసంఖ్యలో ఇస్లాం స్వీకరిస్తే వారి శిక్షణ కోసం వారికి ఖుర్ఆన్ అవగాహన కలిగించటానికి, దాన్ని నేర్చుకోవటానికి సముచిత చర్యల్ని గైకొనేవారు. ఖుర్ఆన్‌ను చక్కగా పఠనం చేసే ఖారీలను, ఖుర్ఆన్‌లోని విషయాలను విపులంగా వివరించే పండితులను వారి వద్దకు పంపేవారు. తద్వారా ప్రజలు ఇస్లామీయ బోధనలను చక్కగా ఆకళింపు చేసుకుంటారని ఆయన ఉద్దేశ్యం.

ఈ చర్యల వల్ల ఇస్లామీయ రాజ్యంలో ఒక ప్రత్యేకమైన, శాశ్వతమైన సంస్కృతి ఉనికిలోకి వచ్చింది. ఇతరులకు భిన్నంగా ఒక విశిష్టమైన సభ్యత ముస్లింల గుర్తింపుగా పెంపొందింది. దీనివల్ల ముస్లింలేకాక ముస్లిమేతరులు కూడా లాభపడసాగారు. ఏమరుపాటులో ఉన్న అనేక మంది, చెడు వర్తనపు పర్యవసాలను చూసి ముస్లింలు కాసాగారు. వారి విద్యాసంస్కారాల కోసం ఇస్లామీయ రాజ్యంలోని అన్ని ప్రాంతాల్లో మస్జిద్‌ల నిర్మాణంచేసి, సామూహిక నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఊళ్ళో, ప్రతి తెగలో ఇమాములను నియమించారు. ఇచ్చిపుచ్చుకోవటానికి సంబంధించిన పాతపద్ధతులను తొలగించి ఇస్లామీయ పద్ధతులు ప్రవేశింపబడ్డాయి. పరిపాలనా వ్యవహారాల్లో తనకు సలహా ఇవ్వటానికి దైవభీతిగల గుణవంతులు, వివేకవంతులు, ధర్మనిష్టాపరులయిన ప్రవక్త అనుచరులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీని "మజ్లిసె షూరా" అని పిలవడం జరిగింది. ఈ కమిటీ మెంబర్లంతా ప్రవక్త సహచరులు, ఆయన ద్వారా సుశిక్షితులయిన వారు. జ్ఞానంలోనే



కాదు నడవడికలోను సాటిలేనివారు. ఏదైనా సమస్య ఉత్పన్నమై నప్పుడు వీరంతా కలిసి ముందు ఖుర్ఆన్‌లో, ప్రవక్త సంప్రదాయాల్లో వెదికేవారు. అందులో దాని పరిష్కారం లేకపోతే తమతమ బుద్ధికుశలతలతో దానికి పరిష్కారం సూచించేవారు. హజ్రత్ ఉమర్ కూడా ఈ సమస్యపై ఆలోచన జరిపేవారు. ఈ కమిటీవారు సూచించిన పరిష్కారం ఖుర్ఆన్, సున్నత్‌ల ప్రకారం ఉంటే వెంటనే దాన్ని స్వీకరించి అమలుపరిచేవారు. ఈ కారణంగా ప్రజలందరికీ లాభం చేకూరింది. ఇస్లాం న్యాయం, సమానత్వాలను కోరుతుందని, శాంతి సామరస్యాలను స్థాపించదలిచిందని అందరికీ తెలిసిపోయింది. ఫలితంగా సత్యసందేశ ప్రచారానికి నలువైపుల ద్వారాలు తెరుచుకున్నాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి) ఇలా చెప్పేవారు: "ఉమర్ ఇస్లాం స్వీకరణ ముస్లింలకు ఘనవిజయం లాంటిది. ఆయన హిజ్రత్ ముస్లింలకు సహాయకారి లాంటిది, ఆయన ఖిలాఫత్ (పరిపాలన) ముస్లింలకు కారుణ్యం లాంటిది. దీనివల్ల ఇస్లాం ప్రజల్లో ఆసక్తి కరమైన ధర్మంగా మారి శీఘ్రంగా వ్యాపించసాగింది.

హజ్రత్ ఉమర్ (రజి) సలహామండలిలో అత్యధికంగా ఉలమాలు (ధార్మిక పండితులు) ఉండేవారు. విద్యాధికులను ఆయన అమితంగా గౌరవించేవారు. వ్యక్తిత్వాలను గుర్తించటంలో ఆయన దిట్ట. ప్రతి వ్యక్తిలోనున్న ప్రత్యేకతను చాలా తొందరగా గుర్తించేవారు. తదనుగుణంగా ఆ వ్యక్తికి ఆ బాధ్యత అప్పగించేవారు. ఒక హోదాపై ఎవరినయినా నియమించే ముందు అతనిలోని యోగ్యతల్ని నిశితంగా పరీక్షించేవారు. ఎవరికయితే అత్యధికంగా ఖుర్ఆన్ కంఠస్థమై ఉండి, చక్కగా పారాయణం చేస్తూ, దాని ప్రకారం తు.చ తప్పకుండా నడిచే వ్యక్తిని 'ఖాజీ'గా (జడ్జిగా) నియమించేవారు. నియమించి ఊరకుండేవారు కాదు, ఒక కంట కనిపెడ్తూ ఉండేవారు. సందర్భానుసారం తగిన సూచనలు కూడా ఇచ్చేవారు.

ఒకసారి హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి)కు పరిపాలనా పద్ధతులు వివరిస్తూ ఇలా వ్రాశారు. "ఎవరి పాలన వల్ల అతని ప్రజలు స్థితిపరులవుతారో దైవం దృష్టిలో అతను చాలా అదృష్టవంతుడైన పరిపాలకుడు. ఎవరి పాలన

వల్ల అతని ప్రజలు పేదలైపోతారో అతను దురదృష్టుడైన పాలకుడు. కనుక నీవు స్వయంగా పెడత్రోవ పట్టకుండా ఉంటే నీ క్రింది అధికారులు కూడా వక్రమార్గాలను అనుసరించరు.'' (హయాతుస్సహాబ-వా-2. పేజి. 169)

హజ్రత్ ఉమర్ (రజి) జారీ చేసిన ఇలాంటి ఆదేశాలు, ఆయన సత్పరిపాలన వల్లనే ముస్లిమేతరులు ప్రభావితులై, గుంపులు గుంపులుగా ఇస్లాం స్వీకరించారు.

# 3. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి)

ఇస్లాం ఇచ్చిన సద్వచనం లా ఇలాహ ఇల్లల్లాహ్. ఒక మనిషి ఈ సద్వచనాన్ని పఠించి తన యావత్తు జీవితాన్ని అల్లాహ్ దాస్యానికే అంకితం చేస్తాడు. అతను చేసే ప్రతి పనీ అల్లాహ్ ఆదేశాలకనుగుణంగానే ఉంటుంది. అతను వేసే ప్రతి అడుగు దైవాదేశాలవైపు పడుతుంది. అతను దైవధర్మం కోసం, దైవప్రసన్నత కోసం అహర్నిశలు ఆలోచిస్తూ ఉంటాడు. ఈ లక్ష్యం కోసమే జీవిస్తాడు, ఈ లక్ష్య సాధనలోనే తుదిశ్వాస విడుస్తాడు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) జీవితం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. హజ్రత్ అబూబకర్ ప్రేరణ, ప్రోత్సహాలతో ఆయన ఇస్లాం స్వీకరించారు. ఆయన అజ్ఞాన కాలంలో సైతం ఎన్నడూ మధుపానం చేయలేదు. తన మిత్రులం దరిలో నచ్ఛీలునిగా గుర్తించబడ్డారు. అయితే సత్యధర్మస్వీకరణ తరువాతయితే ఆయన జీవితంలో, నడవడికలో, ప్రవర్తనలో గొప్ప పరివర్తన వచ్చింది. దైవం ఆయనకు పెద్దఎత్తున సిరిసంపదలు కూడా ప్రసాదించాడు. అయితే ధనవ్యామోహంలో పడిపోయిన వ్యక్తుల్లో కనబడే ధనపిపాస ఆయనలో మచ్చుకు కూడా లేదు. దైవధర్మం కోసం ధనాన్ని వెచ్చించాల్సిన సందర్భం వస్తే ఆయన అత్యంత దాతృత్వాన్ని ప్రదర్శించేవారు. ముస్లింలు మదీనా పట్టణానికి వలస వచ్చిన తరువాత నీటి సమస్య ఎదుర్కోవలసి వచ్చింది. మదీనాలో ఒక యూదునికి చెందిన బావి ఉండేది. అతను అత్యధిక



ధర తీసుకొని ముస్లింలకు నీటిని అమ్మేవాడు. హజ్రత్ ఉస్మాన్ ముస్లింలు పడుతున్న ఈ బాధ సహించలేక 35 వేల దిర్హంలకు ఆ బావిని కొని ముస్లిం సమాజానికి అంకితం చేశారు. (ఇస్లామీయ చరిత్ర- అక్బర్‌షా నజీబాబాది. వా-1. పేజి. 375)

ఇదేవిధంగా ఆయన తబూక్ దండయాత్ర కోసం పదివేల బంగారు నాణాలు తెచ్చి, దైవప్రవక్త (స)కు సమర్పించుకున్నారు. వాటిని చూచి దైవప్రవక్త (స) ఎంతగానో సంతోషించారు. ఈ నాణాలను ఎగురవేస్తూ ఆయన ఇలా అన్నారు:

''ఈరోజు తరువాత ఉస్మాన్ ఏ చర్య కూడా ఆయనకు హాని కలిగించదు'' (ఇస్లామీయ చరిత్ర- షామొయినుద్దీన్ నద్వి- వా-1 పేజి. 332)

హజ్రత్ ఉస్మాన్ తనతో ఇలా అన్నారని ఇబ్నె నూరుల్ ఫహ్మీ చెప్పిన విషయాన్ని ఇబ్నె అసాకర్ ఇలా పేర్కొన్నారు:

నాలోని పది గుణాలు అల్లాహ్ వద్ద భద్రంగా ఉన్నాయి. వాటిలో కొన్ని ఇవి:

1. ఇస్లాం స్వీకరించిన వారిలో నేను నాలుగవ వ్యక్తిని.
2. నృత్యసంగీతాల్లో నేనెన్నడూ పాల్గొనలేదు.
3. నేనెన్నడూ పనికిమాలిన పనుల్లో పాల్గొనలేదు.
4. నేనెన్నడూ చెడు గురించి, పాపం గురించి మాట్లాడలేదు.
5. దైవప్రవక్త (స) చేతిలో చేయివేసి ప్రమాణం చేసిన (తరువాత) ఆ (కుడి)చేతితో నా మర్మాంగాన్ని ఎన్నడూ ముట్టుకోలేదు.
6. అజ్ఞానకాలంలోగాని, ఇస్లాం స్వీకరించిన తరువాతగాని, నేనెన్నడూ వ్యభిచారానికి పాల్పడలేదు.
7. అజ్ఞానకాలంలోగాని, ఇస్లాం స్వీకరించిన తరువాత గాని నేనెన్నడూ దొంగతనానికి పాల్పడలేదు.

8. ఇస్లాం స్వీకరించిన తరువాత, ప్రతి శుక్రవారం ఒక బానిసను కొని విముక్తి కలిగించాను. ఆరోజు సాధ్యపడకపోతే తర్వాత కొని విముక్తి కల్గించాను.

ఒకసారి మదీనాలో తీవ్రమైన కరువు ఏర్పడినప్పుడు హజ్రత్ ఉస్మాన్ (రజి) తన గిడ్డంగులు తెరచి పేదలకు సహాయం అందజేశారు. ఇవన్నీ చేసికూడా తాను ధనికుడని ఏనాడూ గర్వించలేదు, ఏ సందర్భం వచ్చినా దైవమార్గంలో ధనాన్ని ఖర్చుపెట్టటంలో ఆయన వెనుకాడ లేదు.

హజ్రత్ ఉస్మాన్ గని (రజి) విశాలహృదయం, అత్యంత దాతృత్వగుణం కలవారు. ధర్మవ్యాప్తి కార్యకలాపాలలో ఎంతో ఉత్సాహం కనబరిచేవారు. ఎక్కడయినా, ఎప్పుడయినా ధర్మప్రచారానికి అవకాశం లభిస్తే, దాన్ని విడిచి పెట్టేవారు కాదు. ఇస్లాం స్వీకరించిన తరువాత అత్యధిక సమయం దైవప్రవక్త (స)తో గడపటానికి ప్రయత్నించారు. ప్రతిసభలో, ప్రతి సమావేశంలో పాల్గొని, ధార్మిక విషయాలు తెలుసుకొని వాటిని ఇతరులకు తెలిపేవారు. ఒకసారి ప్రజలకు ఉజూ చేసి చూపిస్తూ దైవప్రవక్త (స) ఇలాగే ఉజూ చేస్తుండగా తాను చూశానని చెప్పారు.

దైవధర్మం తప్ప మరే ఇతర మార్గాల ద్వారా మనిషి ఆత్మసంతృప్తిని, మనశ్శాంతిని పొందలేడు. ఎవరికైతే దైవధర్మం లభిస్తుందో, దాన్ని ఇతరులకు చేరవేయాలని, నలుగురికీ పంచిపెట్టాలనే తపన అతన్ని ప్రశాంతంగా కూర్చోరాదని, ఎవరయితే దైవాన్ని మరిచిపోయి తమ ఇష్టానుసారం జీవితాన్ని గడుపుతున్నారో వారికి దైవసందేశం అందజేయాలని అపమార్గంలో పయనించేవారిని సన్మార్గంవైపుకు మళ్ళించాలని హజ్రత్ ఉస్మాన్ ఎల్లప్పుడూ తాపత్రయం పడేవారు. వారి ప్రభువు, స్వామి, ఆరాధ్యుడు అల్లాహ్ మాత్రమే నని, ఆయన్నే ఆరాధించాలని వారికి నచ్చజెప్పడానికి సదా సంసిద్ధులై ఉండేవారు. ప్రపంచంలోని ఒక్కొక్క వ్యక్తి వరకు దైవసందేశం చేరవేయాలనే తపన మహాప్రవక్త (స) సహచరుల్లో ఉద్భవింపజేశారు. హజ్రత్ ఉస్మాన్‌కు సత్యధర్మ ప్రచారకార్యం ఎంతగానో ప్రేరణ కల్గించింది. దీనికి సంబంధించిన



ఏ ఒక్క అవకాశాన్ని ఆయన జారవిడుచుకోవటానికి సిద్ధపడేవారు కాదు. ఆయన వివిధ తెగల ప్రజల దగ్గరికి వెళ్ళి ఇస్లాం సత్యసంధతను వివరిస్తూ వారిని ఈ ధర్మం వైపునకు ఆహ్వానించే వారు. ఒకసారి అనేకమంది రోమన్ బానిస మహిళలు బందీలైవచ్చారు. ఆయన వారి వద్దకు వెళ్ళి ఇస్లాంలోని సుగుణాలను, ప్రత్యేకతల్ని వివరించి ధర్మ పరివర్తనకు ప్రోత్సహించారు. దాంతో ఆ స్త్రీలందరూ ఇస్లాం స్వీకరించి ముస్లిములై పోయారు.

హజ్రత్ ఉస్మాన్ ఖలీఫా పదవి చేపట్టిన తరువాత అనేక బాధ్యతలు వచ్చిపడినా ధర్మప్రచార బాధ్యతను మాత్రం మరచిపోలేదు.

ధర్మప్రచారం వల్ల మస్జిద్-ఎ- నబవీలో ప్రజలు అత్యధిక సంఖ్యలో వస్తుండటం వల్ల స్థలాభావం ఏర్పడింది. అందుకని ఆయన ఈ మస్జిద్‌ను విస్తృతపరిచి ప్రజలకు ఎంతో మేలు చేశారు. శుక్రవారం రోజున నమాజుకోసం వచ్చే అత్యధిక జనసమూహం వల్ల అజాన్ పిలుపు అందరికీ వినిపించేది కాదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రసంగానికి (ఖుత్బాకు) ముందు ముఅజ్జిన్ ఒక ఎత్తైన ప్రదేశంలో నిలబడి ఇంకొకసారి అజాన్ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఈ విధంగా ఆనాటి నుండి శుక్రవారం రోజు రెండుసార్లు అజాన్ ఇచ్చే సంప్రదాయం ఏర్పడింది. దీంతో నమాజ్‌కు ముందే అజాన్ విని ప్రజలు మస్జిద్‌కు తొందరగా రావటానికి మస్జిద్‌లో చెప్పే ధార్మిక విషయాలు తెలుసు కోవటానికి, నమాజ్ ప్రారంభానికి ముందు ఇవ్వబడే ప్రసంగం (ఖుత్బా) వినటానికి చక్కటి అవకాశం కలిగింది.

దైవప్రవక్త (స) నుండి అత్యధిక ప్రయోజనం పొందిన వారిలో హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా ఉన్నారు. ఈకారణంగానే ఆయన ఎప్పుడూ ప్రజలకు ధార్మిక విషయాలు తెలుపుతూ ఉండేవారు. ఏదైనా సమస్య వస్తే ఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాల ప్రాతిపదికగా దానికి పరిష్కారం చెప్పేవారు. ఒకసారి యుద్ధంలో (ఖుర్ఆన్ కంఠస్థం చేసిన) హాఫిజ్‌లు అధికసంఖ్యలో అమరగతు లయ్యారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని హజ్రత్ అబూబకర్(రజి) పాలనా

కాలంలో ప్రవక్త సహచరుల ద్వారా సంపూర్ణ ఖుర్‌ఆన్‌ను ఒకే గ్రంథరూపంలో లిఖించి భద్రపరచడం జరిగింది.

హజ్రత్ ఉస్మాన్ గని (రజి) ఖిలాఫత్ కాలంలో వివిధ ప్రాంతాల్లోని ప్రజలు ఖుర్‌ఆన్‌ను తమ తమ యాసలో చదువుతున్నారనే విషయం తెలిసింది. ఈ విషయం గురించి చర్చించేందుకు ఆయన ఒక సమావేశం ఏర్పాటుచేసి పరిస్థితి వారి ముందుంచారు. సభికులందరూ ఒకే రీతి (యాస)లో ఖుర్‌ఆన్ పఠనం చేయాలని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో వివిధ భాగాలన్నీ సమీకరించి ఒకే గ్రంథంగా కూర్చి హజ్రత్ హఫ్సా (రజి) వద్ద భద్రపరచబడి ఉన్న ఖుర్‌ఆన్ ప్రతిని తెప్పించారు. ఈ మూల ప్రతికి అనేక నకళ్ళు తీయించి రాజ్యంలోని ప్రధాన పట్టణాలన్నిటికీ ఒక్కొక్క ప్రతిని పంపించడం జరిగింది.

హజ్రత్ ఉస్మాన్ బాల్యంలోనే చదవటం వ్రాయటం నేర్చుకున్నారు. ఇస్లాం స్వీకరణ తరువాత ఈ విద్యాసక్తి ఇంకా అధికమయింది. దైవప్రవక్త (స) సహచర్యం వల్ల ఆయనలోని విద్యాభిమానం ద్విగుణీకృతమయింది. దైవప్రవక్త (స) జీవిత కాలంలోనే ఫత్వాలు ఇచ్చే అధికారం పొందిన బృందంలో ఈయన కూడా ఉన్నారు. హలాల్, హరామ్ విషయాలను విశ్లేషించటంలో ఈయన ఉద్దండుడు.

హాఫిజ్ ఇబ్నెహజర్‌ను అనుసరించి, ఖుర్‌ఆన్‌లోని ఒక ఆయతు "వ-కాన-తహ్‌తహు-కన్‌జల్లహుమ"ను విశ్లేషిస్తూ హజ్రత్ ఉస్మాన్ ఈక్రింది విధంగా తెలుపారని పేర్కొన్నారు:

అదొక బంగారు పలక. దానిపై ఏడు పంక్తులు వ్రాయబడి ఉన్నాయి. దాని అనువాదమిది-

- ◆ మృత్యువు ఉందని తెలిసి కూడా నవ్వుతున్న వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.
- ◆ ఈ ప్రపంచం ఒకానొకరోజున నశిస్తుందని తెలిసి కూడా అందులోనే



మునిగిపోయిన వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.

- ◆ ప్రతీది విధిప్రకారమే లభిస్తుందని తెలిసి కూడా ఒక వస్తువు పోయినప్పుడు విచారించే వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.
- ◆ పరలోకంలో కర్మవిచారణ జరుగుతుందన్న విశ్వాసం కలిగివుండి కూడా ధనాన్ని కూడబెట్టున్న వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.
- ◆ నరకాగ్ని యాతనల గురించి తెలిసి కూడా పాపానికి ఒడిగడ్తున్న వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.
- ◆ అల్లాహ్‌యే తన స్వామి, యజమాని అని తెలిసి కూడా వేరే విషయం గురించి మాట్లాడుతున్న వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.
- ◆ స్వర్గం గురించి తెలిసి కూడా ప్రాపంచిక వ్యామోహంలో పడివుండే వ్యక్తి పట్ల నాకు ఆశ్చర్యం వేస్తుంది.

పై విషయాలు ఎవరు, ఎప్పుడు వ్రాశారు? అనే విషయం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు. అయినప్పటికి వీటిగురించి ఆలోచించటానికి ఆచరణలో తేవటానికి ఎవరైనా ప్రయత్నిస్తే అతని జీవితం సంస్కరించ బడుతుంది. హజ్రత్ ఉస్మాన్ (రజి)లో పరలోక భావన ఎంతగానో ఉండేది, ఆయన ఎప్పుడయినా ఏదైనా సమాధి వద్ద నుండి వెళ్తుంటే దాన్ని చూచి ఆయన ఎంతగా ఏడ్చేవారంటే, ఆయన గడ్డం తడిసిపోయేది. స్వర్గ నరకాల ప్రస్తావన వచ్చినప్పుడు కూడా మీరు ఇంతగా రోదించరే! సమాధి వద్దకు వెళ్ళినప్పుడు అంతగా దుఃఖించటానికి కారణమేమిటని ఒక వ్యక్తి ప్రశ్నించగా ఆయనిలా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త (స) చెప్తుండగా విన్నాను- పరలోకపు మజిలీలలో సమాధి మొట్టమొదటి మజిలీ. ఎవరయినా ఈ మజిలీని సులభంగా దాటితే మిగతా మజిలీలన్నీ అతడు అవలీలగా దాటగలుగుతాడు. ఈ మొదటి మజిలీలోనే ఇరుక్కుపోతే మిగిలిన మజిలీలు మరింత కఠినమై పోతాయి. సమాధికన్నా కఠినమైన సన్నివేశం నేనెక్కడా చూడలేదు." (హయాతుస్సహాబ- వా-2, పేజి 784)

# 4. హజ్రత్ అలి (రజి)

మానవులు విజయవంతమైన జీవితం గడపాలన్న ఉద్దేశ్యంతోనే దేవుడు ధర్మాన్ని అవతరింపజేశాడు. ఈ పనికోసం అప్పుడప్పుడు ఆయన తన ప్రవక్తలను పంపుతూ వారి ద్వారా మానవజాతికి సన్మార్గం చూపించాడు.

స్వయంగా ఏకేశ్వరుడ్ని ఆరాధిస్తూ ప్రజలను విగ్రహారాధన, బహుదైవారాధనల నుండి కాపాడేందుకు కృషి చేస్తూ, సత్యాన్ని, సన్మార్గాన్ని అవలంబించటమేకాక, ఇతరులను సత్యం, సన్మార్గాల వైపుకు ప్రోత్సహించే మనిషి మాత్రమే అత్యంత సఫలీకృతుడయిన వ్యక్తిగా గుర్తించ బడతాడు. ఈ కార్యం కోసమే దైవప్రవక్తలు పంపబడ్డారు. ఈ పనినే "షహాదత్ అలన్నాస్" (మానవుల ముందు సాక్ష్యం ఇవ్వటం) అని అంటారు.

ఈ కార్యం కోసమే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) పంపబడ్డారు. ఈ ప్రపంచం అల్లాహ్ సృష్టితమని, మానవులంతా ఆయన దాసులని, అందుకని వారు ఆయన్నే ఆరాధించాలని, ఆయన ఆదేశాల ప్రకారమే జీవితం గడపాలని, ఇదే సత్యమార్గమని, దీన్ని అవలంబిస్తేనే ఇహపరాల్లో సాఫల్యం చేకూరుతుందని ఆయన ప్రజలకు బోధించారు.

ఈ సందేశం విని సత్యాన్ని ప్రేమించేవారు ఎలాంటి సంకోచం లేకుండా ఆయన్ను విశ్వసించారు. ఇలాంటి వారిలో హజ్రత్ అలి (రజి) ఒకరు. దైవదౌత్యం ప్రారంభ కాలంలోనే ఆయన ఇస్లాం స్వీకరించారు. అప్పుడాయన వయస్సు పది సంవత్సరాలు మాత్రమే.

సమీప బంధువులను దైవశిక్ష గురించి హెచ్చరించమని దైవాదేశం రాగానే దైవప్రవక్త (స) తన ఇంట్లో ఖురైష్ తెగ నాయకులను విందుకు ఆహ్వానించారు. విందు ఏర్పాటు బాధ్యత హజ్రత్ అలీ (రజి)కి అప్పగించ బడింది. ఆయన ఎంతో ఉత్సాహంతో ఈ ఏర్పాట్లు చేశారు.

భోజనాలయ్యాక దైవప్రవక్త (స)వారి నుద్దేశించి ఇలా అన్నారు: "ఓ ముత్తలిబ్ వంశీయులారా! నేను ఏ సందేశాన్నయితే తీసుకొని వచ్చానో దీంట్లో



మీ ఇహపరాల సాఫల్యం ఉంది. చెప్పండి, మీలో ఎవరు నాకు ఈ కార్యంలో సహకరిస్తారు?" (ఇస్లామీయ చరిత్ర- షామొయినుద్దీన్ నద్వీ. వా-1, పే. 288)

సమావేశంలో నిశ్శబ్దం రాజ్యమేలింది. ఏ ఒక్కరూ దైవప్రవక్త (స)కు సహాయకారిగా నిలబడటానికి సంసిద్ధత తెలుపలేదు. అప్పుడు హజ్రత్ అలీ ఒక్కరే ధైర్యంగా నిలబడి ఇలా అన్నారు:

"అన్నయ్యా! నేను పిన్న వయస్కుడ్ని అయినప్పటికి, నా కాళ్ళు బాధపెడుతున్నప్పటికీ దీని గురించి నేను చింతించటం లేదు. నేను మీకు అండగా నిలబడతాను. అన్ని విధాలా మీకు సహకరిస్తాను" (ఇస్లామీయ చరిత్ర- షామొయినుద్దీన్ నద్వీ. వా-1, పే. 288)

పదేళ్ళ బాలుడి నోట వెలువడిన ఈ మాటలు విని సభికులంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. తరువాత ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోయారు. దైవసందేశదాత(స) వారిని నరకాగ్ని నుండి కాపాడాలని ప్రయత్నిస్తున్నాడు, తన వంశం, వర్గం వారిపట్ల ఆయనకు అమితమైన ప్రేమ ఉంది. ఆయన వారికి నిజమైన శ్రేయోభిలాషి. వారు దైవశిక్షకు గురికావటం ఆయనకు ఇష్టం లేదు. అయితే ఆయన వంశస్థులు, పట్నంవాసులు మాత్రం ప్రాపంచిక వ్యామోహంలో మునిగిపోయారు. అందుకే వారు దైవప్రవక్త (స) మాటల్ని పట్టించుకోలేదు. ఐహిక వ్యామోహం, ధనపిపాస, భోగలాలసల అలవాటు వారిని సత్యం చూడలేని గుడ్డివారుగా చేసింది. ప్రవక్త బోధనలతో వారి హృదయాలు కరగలేకపోయాయి. అయితే వారిలో నుండే హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త(స) సందేశాన్ని స్వీకరించి జీవితాంతం దాని విశ్వాసంలో దృఢంగా నిలువగలిగారు. దైవం ఆయనకు అసామాన్య ధైర్యాన్ని కూడా ఇచ్చాడు. అంతేకాక దైవప్రవక్త (స) సంరక్షణలో బాల్యాన్ని గడిపే భాగ్యాన్ని కూడా ప్రసాదించాడు.

దైవప్రవక్త (స) సంరక్షణలో ఆయనకు సత్యం, నిజాయితీ, సత్య సంధతకు సంబంధించి ఏ శిక్షణ లభించిందో తరువాత కాలంలో సందేశ ప్రచారకార్యంలో అది ఎంతగానో వృద్ధిచెంది బాగా ఉపకరించింది.

మహాప్రవక్త (స) దైవసందేశాన్ని ఎలా వ్యాపింపజేస్తూ పోయారో, అలా ప్రజలు ఆయనకు శత్రువులుగా మారారు. ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. కఠినాతి కఠిన పరీక్షల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. మహాప్రవక్త (స)తో పాటు హజ్రత్ అలీ కూడా వాటిని ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆయన మొక్కబోని ధైర్యసాహసాలతో వాటన్నిటినీ అధిగమించారు. ఏనాడూ తన ప్రాణం గురించి ఆలోచించలేదు.

హజ్‌కాలంలో దూరప్రాంతాల నుండి వచ్చిన వివిధ తెగల వారి వద్దకు వెళ్ళి ధర్మప్రచారం చేయటం మహాప్రవక్త (స) మామూలు. అలాంటి సందర్భాలలో హజ్రత్ అలీ, హజ్రత్ అబూబకర్‌లు  ఆయన(స) వెంట నీడలా ఉండేవారు.

ఒకసారి 'షీబాన్' తెగకు చెందిన వారితో చర్చ జరిగింది. 'మఫ్‌రూఖ్' అనే వ్యక్తి దానికి నాయకుడు. అతను హజ్రత్ అబూబకర్‌కు పరిచయం. హజ్రత్ అలీ కూడా వెంట ఉన్నారు. హజ్రత్ అబూబకర్, మఫ్‌రూఖ్‌కు మహాప్రవక్త (స)ను పరిచయం చేస్తూ ఈయన దైవప్రవక్త, ఈయనగారి గురించి మీరు వినే ఉంటారని చెప్పారు.  ఆ  తరువాత మహాప్రవక్త (స) ఇస్లాంకు సంబంధించిన మౌలిక విషయాలు అతనికి తెలిపారు.

హజ్రత్ అలీ ఒంటరిగా కూడా ధర్మప్రచారం చేస్తుండేవారు. మదీనాకు చెందిన హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి  ఒకసారి సందేశదాతను (స) గురించి తెలుసుకోవటానికి మక్కా వచ్చారు.  ఆయనతో మాట్లాడి దైవప్రవక్త(స) ఉంటున్న ఇంటికి ఆయన్ను పిలుచుకొని వచ్చినవారు హజ్రత్ అలీయే. ఆ తరువాత హజ్రత్ అబూజర్ ఇస్లాం భాగ్యాన్ని పొందగలిగారు.

ఇస్లాం వ్యాప్తి చూసి మక్కా అవిశ్వాసులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ విషయాన్ని వారు తమ పూర్వీకుల ధర్మానికి,  సభ్యతకు, సమాజానికి ఒక చాలెంజ్‌గా భావించి ఇస్లాం స్వీకరించిన వారిని రాత్రింబవళ్ళు రకరకాలుగా బాధించేవారు. వారిని మండుతున్న ఇసుకపై ఈడ్చటం, నిప్పులపై పరుండబెట్టటం, కదలకుండా వారిపై పెద్దపెద్ద బండరాళ్లను మోపటం చేయసాగారు.



అయితే నరకయాతనల్ని తలపింపజేసే ఈ కష్టాలను అనుభవిస్తూ కూడా ముస్లింలు ఏమాత్రం వెనుకాడలేదు; విశ్వాసం నుండి ఒక్క అంగుళం కూడా వెనక్కు పోలేదు.

చివరికి దేవునికి వారిపై దయకలిగింది. తన విశ్వాస పాత్రులైన ఈ దాసులు క్రూరుల పట్నం వదలి  మదీనా  వలస పోవాలని ఆదేశం వచ్చింది. అప్పుడు ఒక్కొక్కరు, ఇద్దరేసి చొప్పున ముస్లింలు మక్కా వదలి మదీనాకు వలసవెళ్ళారు. చివరికి ముగ్గురు మాత్రమే మక్కాలో మిగిలిపోయారు. వారిలో ఒకరు దైవప్రవక్త (స), రెండవవారు హజ్రత్ అబూబకర్ (రజి), మూడవ వ్యక్తి ఎల్లప్పుడూ దైవప్రవక్త (స)ను అంటిపెట్టుకుని ఉండే హజ్రత్ అలీ (రజి).

ముస్లింలంతా  మక్కా  వదలి వెళ్ళిపోయారని తెలిసిన శత్రువులు దైవప్రవక్త (స)ను హతమార్చటానికి పథకం వేసుకున్నారు. చీకటి కమ్ముకోగానే ప్రతి తెగ నుండి ఒక యువయోధుడు నగ్నఖడ్గాన్ని చేతబూని, దైవప్రవక్త (స) ఇంటిని చుట్టుముట్టారు. దైవప్రవక్త (సకు కూడా వలస వెళ్ళటానికి దైవాదేశం వచ్చింది. ఆయన ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారు. వెళ్ళటానికి ముందు హజ్రత్ అలీని పిలిచి ఇలా చెప్పారు:

"నా పడకపై నా దుప్పటి కప్పుకొని పడుకో. నిన్ను ఎవరేమి చేయలేరు. మక్కావాసులు నా దగ్గర దాచుకొన్న ఈ అమానతులను తెల్లారిన తరువాత ఎవరివి వారికి అప్పగించి మదీనా వచ్చెయ్." (సీరతున్నబి- షుబ్లినొమాని-వా-1, పే. 270)

ఆ తరువాత దైవప్రవక్త (స) మదీనాకు బయలుదేరారు.

ఇది అత్యంత ప్రమాదకరమైన సమయం. ఇంటి బయట శత్రువులు నగ్నఖడ్గాలతో కావలి కాస్తున్నారు. ఇంట్లో హజ్రత్ అలీ (రజి) ఒంటరిగా ఉండికూడా ఎలాంటి  భయాందోళనలకు గురికాకుండా ఒక్క అల్లాహ్‌ను నమ్ముకుని నిశ్చింతగా పండుకున్నారు. అల్లాహ్‌నే నమ్ముకునే మనిషికి అల్లాహ్ తప్పకుండా రక్షకుడై నిలబడతాడు. విరోధులు ఎంత ప్రయత్నించినా వారికి నిరాశానిస్పృహలే మిగిలిపోతాయి. ఇక్కడ కూడా అవిశ్వాసుల పన్నాగాలన్నీ

నిష్ఫలమయ్యాయి. తెల్లవారింతరువాత దైవప్రవక్త (స) ఇంట్లో చొరబడి దుప్పటి తీసి చూడగా వారికి హ(జ్రత్ అలీ కనబడ్డారు. గత్యంతరం లేక వెను దిరిగారు. అనుకున్న ప్రకారం మరుసటిరోజు హ(జ్రత్ అలీ మక్కావారి అమానతులను (సొత్తులను) ఎవరివి వారికి అప్పగించి మదీనా వచ్చేశారు.

మదీనా వచ్చిన తరువాత కూడా ముస్లింలను మక్కా అవిశ్వాసులు నిశ్చింతగా కూర్చుండనివ్వలేదు. అనేకసార్లు వారు సైన్యాలతో దాడి చేశారు. భీకర యుద్ధాలు జరిగాయి. హ(జ్రత్ అలీ (రజి) ప్రతి యుద్ధంలో పాల్గొన్నారు. సత్యధర్మ జ్యోతిని కాపాడటానికి మొక్కవోని ధైర్యంతో శత్రువులనెదుర్కొన్నారు. ఈ కారణంగానే ఆయనకు 'షేరెఖుదా' (దైవసింహం) అనే పేరు వచ్చింది. మక్కా జయింపబడిన రోజు కూడా ఆయన దైవప్రవక్త (స) వెంట ఉండి కాబాగృహంలోని విగ్రహాలను తొలగించటంలో ఆయనకు సహకరించారు.

ఆయన్ను సంబోధిస్తూ దైవప్రవక్త (స) ఒకసారి ఇలా అన్నారు:

"అలీ! నీ చేతిలో ఒక్క బహుదైవారాధకుడు కూడా ఇస్లాం స్వీకరిస్తే అది నీకు ఎర్ర ఒంటెల కన్నా ఎంతో విలువైనది"★ (హయాతుస్సహాబ-వా-1, పే.145)

ఈ మాట హ(జ్రత్ అలీ (రజి) హృదయంలో నాటుకుపోయింది. అందుకే ఆయన ఎల్లప్పుడూ దైవధర్మాన్ని ప్రజలకు అందజేస్తుండాలనే పనిని తన జీవిత ధ్యేయంగా చేసుకున్నారు.

'హుదైబియా' ఒప్పందం తరువాత దైవప్రవక్త (స) ధర్మప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల పాలకులకు, రాజులకు, సత్యసందేశాన్ని తెలుపటానికి ప్రతినిధి బృందాలను పంపారు. ఆ సందర్భంలో హ(జ్రత్ అలీ (రజి)ని యమన్‌కు పంపించారు. యమన్‌లో ఉండే 'హమ్‌దాన్' తెగ ప్రజలకు ఇస్లాం గురించి బొత్తిగా తెలియదు. మద్యసేవనం, నృత్యగానం, ఆటపాటలే వారి దైనందిన కార్యకలాపాలు.

యమన్ చేరిన తరువాత హ(జ్రత్ అలీ (రజి) హమ్‌దాన్ తెగవారిని సమావేశపరచి దైవప్రవక్త (స) పంపిన ఉత్తరాన్ని చదివి వినిపించారు. ఆ



తరువాత ఆయన 'ప్రపంచంలోని ప్రతి వస్తువునీ అల్లాహ్‌యే సృష్టించాడని, మానవులు కూడా ఆయన దాసులే అని, ఆయన దాస్యంలోనే మానవుల సాఫల్యం ఉందని, ఈ జీవితం ఒకానొక రోజు సమాప్తం అవుతుందని, మరణానంతరం దైవం మానవుని కర్మల లెక్క తీసుకుంటాడని, మానవుడు ఈ ప్రపంచంలో దైవానికి విధేయుడై, సదాచార జీవితం గడిపితే పరలోకంలో సాఫల్యం పొందుతాడని, అల్లాహ్‌ను విశ్వసించాక ఇష్టానుసారం జీవితం గడిపితే పరలోకంలో కష్టనష్టాలకు గురి అయి, కఠినశిక్ష అనుభవించాల్సి వస్తుందని' వివరించారు.

ఈ మాటలు వారి హృదయాలను ఆకట్టుకున్నాయి. దాంతో ఒకే రోజున ఆ తెగలోని ప్రజలందరూ సత్యధర్మాన్ని స్వీకరించారు. ఈ వార్తను హ(జ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి పంపగా ఆయన 'అస్సలాము అలా హమ్‌దాన్' (హమ్‌దాన్ తెగవారిపై శాంతి వర్షించుగాక) అని మూడు పర్యాయాలు చెప్తూ వారిని దీవించారు. (సీరతున్నబి- షుబ్లినొమాని-వా-2, పేజి.28)

ఆయన ఖలీఫా పదవి చేపట్టిన తరువాత కూడా ఇస్లాం ప్రచారమే ఆయన జీవిత లక్ష్యంగా ఉండేది. దైవభీతిపరులైన విజ్ఞుల సలహాలతో పరిపాలన చేసేవారు. దైవప్రసన్నతకు ప్రాధాన్యతనిచ్చేవారు.

విద్యాజ్ఞానాల మూలంగానే ఒక మనిషి విలువ అంచనా వేయబడు తుంది. హ(జ్రత్ అలీలో ఈ యోగ్యత కూడా అత్యధికంగా ఉండేది. దీన్ని చూసే ఒకసారి దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"నేను విద్యాజ్ఞానాల పట్టణాన్ని. అలీ దాని ముఖద్వారం." (ఇస్లామీయ చరిత్ర- షామొయినుద్దీన్ నద్వి-వా-1, పే.359)

ఆయన తన దగ్గరకు ఏ సమస్య వచ్చినా క్షణాల్లోనే దాన్ని పరిష్క రించేవారు. హ(జ్రత్ అబూబకర్ (రజి), హ(జ్రత్ ఉమర్ (రజి) చిక్కుసమస్య ఎదురైనప్పుడల్లా హ(జ్రత్ అలీ (రజి) సలహా తీసుకొనేవారు. హ(జ్రత్ అలి (రజి) ఖలీఫా అయిన తరువాత తన మొదటి ప్రసంగంలో ఇలా చెప్పారు:

"(ప్రజలారా! మీ మార్గదర్శకత్వానికి అల్లాహ్ ఖుర్ఆన్‌ను అవతరింపజేశాడు. అందులో పాపపుణ్యాలకు సంబంధించిన స్పష్టమైన ఆదేశాలిచ్చాడాయన. సన్మార్గాన్ని, దుర్మార్గాన్ని వేరుపరచి చూపించాడు. సన్మార్గాన్ని అవలంబించి దుర్మార్గాన్ని విడనాడటం మీ విధి. దైవం విధించిన విధుల్ని నెరవేర్చటానికి సదా సిద్ధంగా ఉండండి. తత్ఫలితంగా ఆయన మీకు స్వర్గం ప్రసాదిస్తాడు. ప్రజలారా! నిషేధితాలన్నిటిని మానేయండి. దైవం వాటి జోలికి పోరాదని తెలిపాడు. ముస్లింల గౌరవమర్యాదలు అన్నింటికీ మించినవి. ఇస్లాం దీనికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. చేతితో, నోటితో ఎవరికీ బాధ కలిగించనివాడే నిజమైన ముస్లిం. మరణం రాకముందే మీరు సాధ్యమైనన్ని పుణ్యకార్యాలు చేసి పెట్టుకోండి. సాధ్యమైనంత వరకు ప్రపంచ భారాన్ని తగ్గించుకొని పరలోక యాత్రకై సిద్ధంగా ఉండండి. అల్లాహ్ దాసుల్ని (ప్రజల్ని) బాధపెట్టకుండా ఉండండి. అల్లాహ్ విధేయతను, ఆయన ఆదేశాలను పాటించండి. ఆయనకు అవిధేయులుగా మారకండి. ప్రపంచంలో మీరు బహుకొద్ది సంఖ్యలో బలహీనులుగా ఉన్న రోజులను గుర్తుంచుకోండి.'' (హయాతుస్సహాబ-పే. 513)

ఈ ప్రసంగంలో నీతి, గుణపాఠాలు ఉన్నాయి. పరలోక జీవితపు హెచ్చరికా ఉంది. ఎవరయినా తన జీవితాన్ని సన్మార్గంలో గడపదలుచుకుంటే దానికి తగిన సూచనలు, బోధనలూ ఇందులో ఉన్నాయి.

హజ్రత్ అలి (రజి) చెప్పిన అనేక నీతివాక్యాలు ప్రజల్లో బహుళ ప్రాచుర్యం పొందాయి. ఎవరయినా వీటిని అనుసరిస్తే అతని జీవితం ప్రకాశవంతమై పోతుంది. ఈ క్రింది మాటలు చూడండి, చదవండి. ఆచరించటానికి ప్రయత్నించండి. ఆయనిలా అన్నారు:

- ◆ మనిషి ఒక్క దేవునిపై తప్ప ఇంకెవరి పైనా ఆశలు పెకట్టుకో కూడదు. పాప విషయాలలో తప్ప ఇంకే విషయంలోను ఎవరికీ భయపడకూడదు.
- ◆ తనకు తెలియని విషయం నేర్చుకోవటంలో మనిషి సిగ్గుపడరాదు.
- ◆ ఎవరి మాట ఇంపుగా ఉంటుందో అతనికి అనేకులు మిత్రులవు తారు.



- ◆ జ్ఞానం అల్పుడ్ని ఉన్నతుడిగా చేస్తుంది, అజ్ఞానం ఉన్నతుడ్ని అల్పుడిగా చేస్తుంది.
- ◆ జ్ఞానం ధనం కన్నా శ్రేష్టమైనది. జ్ఞానం నిన్ను రక్షిస్తుంది, ధనాన్ని నీవే రక్షించాల్సి ఉంటుంది.
- ◆ బుద్ధిహీనుడు సదా దరిద్రుడై ఉంటాడు, వివేకవంతుడు ఎల్లప్పుడూ భాగ్యవంతుడై ఉంటాడు. అత్యాశపరుడు ఎల్లప్పుడూ పరాభవింపబడతాడు.
- ◆ అసలైన విజ్ఞత మనోవాంఛలకు వ్యతిరేకంగా పోరాడటంలోనే ఉంది.
- ◆ సృష్టిని గురించి యోచిస్తూ ఉండటం కూడా దైవారాధనే.
- ◆ ఒక వ్యక్తితో మీరు మాట్లాడనంత వరకు అతడ్ని అల్పుడిగా భావించకండి.

# 5. హజ్రత్ జాఫర్ బిన్ అబితాలిబ్ (రజి)

దైవం మానవుని సృష్టించి, అతనికి లెక్కలేనన్ని వరాలు ప్రసాదించాడు. ఈ వరాలన్నింటిలో మహత్తరమైనది తన అభీష్టాన్ని తెలిపే ధర్మాన్ని ప్రసాదించటం. తత్ఫలితంగా మనిషి చక్కటి మార్గంలో జీవితం గడిపి ఆయన పట్ల వినయవిధేయతలతో మెలగాలని ఆయన ఉద్దేశం.

ఈ విషయాలు తెలుపటానికే ఆయన ప్రవక్తల్ని పంపించాడు. వారు తమ వాక్కర్మల ద్వారా సన్మార్గం వైపుకు పిలిచారు, ప్రజలకు మార్గదర్శకులయ్యారు. ఈ కార్యం కోసమే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను కూడా పంపించాడు ప్రభువు. ఆయన ఉద్భవించే నాటికి ప్రపంచ పరిస్థితి అతిహీనంగా ఉండేది. ప్రజలు తమ అవివేకంతో అతిసామాన్యమైన సత్యాలను, మంచి విషయాలను కూడా విస్మరించి చెడుల కూపంలో కొట్టుమిట్టాడుతున్నారు. తమ ప్రభువు అయిన అల్లాహ్‌ను విడనాడి, షైతాన్‌ను ఆరాధిస్తున్నారు. వారు అనేక మిథ్యాదైవాలను పూజిస్తూ ఉండే

వారు. అరబ్బు దేశ పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉండేది. అక్కడ ప్రతి వ్యక్తి అజ్ఞానిగా ఉండడమేగాక తన అజ్ఞానం పట్ల గర్వపడేవాడు కూడా. జూదం, మధుపానంలో రాత్రింబవళ్ళు మునిగి ఉండేవారు. దోపిడీ దొంగతనాలను తమ వృత్తిగా చేసుకున్నారు. రక్తపాతం, హత్యాకాండలు వారి దైనందిన కార్యాలుగా ఉండేవి. 'కాబా' గృహ కారణంగా అల్లాహ్ వారికి ఒక విశిష్ట స్థానం ప్రసాదించినప్పటికీ వారు తమ చెడు అలవాట్ల మూలంగా అధఃపాతాళానికి దిగజారారు.

ఇలాంటి అంధకార బంధురమైన వాతావరణంలో దైవం ముహమ్మద్ (స)ను తన ప్రవక్తగా నియమించాడు. ఆయన 23 సంవత్సరాల వరకు ప్రజల్ని సన్మార్గం వైపుకు మళ్ళించటానికి, ఇస్లాం బోధనలతో వారి వ్యక్తిగత, సామూహిక జీవితాలను తీర్చిదిద్దటానికి సర్వప్రయత్నాలు చేశారు. కాని బుద్ధిహీనులైన అనేకమంది తమ తాతముత్తాతల అంధానుకరణలో సత్యాన్ని స్వీకరించటానికి సంసిద్ధం కాలేదు.

ఒక వక్రమార్గానికి అలవాటుపడిన తరువాత దాన్నుండి మరలటం మానవునికి కొంచెం కష్టమైన విషయమే. ఇది మానవునిలోని బలహీనత. దైవం అతనికి ఆలోచించే, అర్థం చేసుకొనే బుద్ధిజ్ఞానాలనయితే ప్రసాదించాడు. కాని షైతాన్ ప్రేరణ ఎంత బలీయంగా ఎంత వ్యామోహపూరితంగా ఉంటుందంటే, మానవుడు దీని నుండి బయటపడలేక సతమతమవుతాడు. తాను నడిచే వక్రమార్గాన్నే సమర్థించుకుంటాడు. అంతేకాక సత్యజ్యోతిని ఆర్పటానికి కూడా వెనుకాడడు.

మహాప్రవక్త (స) సత్యధర్మం వైపుకు ప్రజల్ని పిలవటం ప్రారంభించగానే ఇదే పరిస్థితి అక్కడ కూడా ఎదురయింది. అవిశ్వాసులు విశ్వసించిన ప్రజల్ని రకరకాలుగా హింసించసాగారు. అడుగడుగున అడ్డంకులు సృష్టించారు. క్రూరంగా బాధలు పెట్టారు. మండే ఇసుకపై ఈడ్చారు. నిప్పుకణాలపై వెల్లకిలా పడవేశారు. సత్యఉపాసకులు ఈ భయంకర బాధలన్నింటిని సహిస్తూ వచ్చారు, దైవధర్మం కోసం ఓర్పు వహించారు. అల్లాహ్ తరఫున



హిజ్రత్ (వలస వెళ్ళాలని) ఆదేశం వచ్చినప్పుడు వారు ఈ త్యాగానికి కూడా సిద్ధపడ్డారు. అలా వలస వెళ్ళిన వారిలో హజ్రత్ జాఫర్ బిన్ అబితాలిబ్ పేరు ప్రముఖంగా పేర్కొనదగినది.

దైవప్రవక్త (స) అనుచరులలో అగ్రగణ్యులైనవారితో కూడిన మొదటి జట్టు వలస వెళ్ళటానికి బయలుదేరినప్పుడు వారికి తమ సౌఖ్యం గురించి గాని, ప్రయాణ బాధల గురించిగాని చింత లేదు. అరబ్బు దేశపు వేడి, నీటికొరత, బహుదూర త్రోవలో ఎదురయిన సర్వకష్టాలను, బాధల్ని చిరునవ్వుతో ఎదుర్కొంటూ చివరికి వారు అబిసీనియాకు చేరారు. పదకొండు మంది పురుషులు, నలుగురు స్త్రీలతో కూడిన ఈ బృందం అబిసీనియా చేరుకుని ప్రశాంత జీవనం గడపసాగింది. కాని షైతాన్ వారి ప్రశాంతతను ఎలా భరించగలడు. ఖురైష్ నాయకుల రూపంలో అతని శిష్యులు వీరిని వెంబడిస్తూ అబిసీనియా రాజు నీగస్ వద్దకు చేరింది. (అరబ్బులు ఈ రాజును 'నజాషి' అని పిలిచేవారు)

ఈ ఖురైష్‌లు రాజదర్బారులోకి వెళ్ళి "మహారాజా! మాలోని కొందరు పారిపోయి మీ దేశానికి వచ్చారు. వీరు ఒక క్రొత్త మతాన్ని స్థాపించుకున్నారు. దీనివల్ల జాతిలో అంతఃకలహాలు చెలరేగాయి. తాతముత్తాల కాలం నుండి వస్తున్న ప్రాచీన ఆచారాల్ని వదలి, వీరు క్రొత్త పద్ధతులను అవలంబించారు. దానివల్ల కల్లోలం లేచే ప్రమాదం ఏర్పడింది. వీరిని మాకప్పగిస్తే మేము మాతో తీసుకువెళతాము" అని విన్నవించుకున్నారు.

నజాషి రాజు అత్యంత వ్యవహారదక్షుడు. విషయాన్ని పూర్తిగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ముస్లింలను పిలువనంపి "మీరు అవలంబించిన కొత్త మతమేమిటి?" అని అడిగాడు. వలస వచ్చిన ముస్లింలలో హజ్రత్ జాఫర్ (రజి) బిన్ అబి తాలిబ్ కూడా ఉన్నారు. ముస్లింలు తమ తరఫున మాట్లాడటానికి హజ్రత్ జాఫర్ బిన్ అబి తాలిబ్‌ను ఎన్నుకున్నారు. ఇస్లాంపై ఆయనకు ప్రగాఢ విశ్వాసముంది. అంతేకాక దాని సత్యతను ప్రజలకు వివరించాలనే అభిలాష కూడా ఆయనలో ఉంది. ధర్మప్రచారం కోసం దైవం

ఒక సదవకాశాన్ని ప్రసాదించాడని, దాన్ని జారవిడుచుకోకూడదని ఆయన నిశ్చయించుకున్నారు. ఆ సందర్భంలో ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేస్తూ రాజసభలో ఆయన చేసిన ప్రసంగం చరిత్ర గ్రంథాల్లో పొందుపరచబడి ఉంది. దాని సారాంశమిది:

"మహారాజా! మేము ఎంతో కాలం నుండి అజ్ఞానం, మార్గవిహీనతల అంధకారంలో తచ్చాడుతూ ఏకేశ్వరుడ్ని విస్మరించి వందలాది విగ్రహాలను పూజిస్తూ ఉండేవారము. మృతజంతువుల్ని తినడం, జూదమాడటం, వ్యభిచరించడం, దోపిడీ దొంగతనాలకు పాల్పడటం, పరస్పరం అన్యాయం అత్యాచారాలకు దిగడం మా దినచర్యలుగా ఉండేవి. మాలోని బలవంతులు బలహీనుల్ని అణచివేసి గర్వపడేవారు. ఈవిధంగా మా జీవితం పశువుల కంటే నీచంగా తయారయింది. మా పరిస్థితిపై కరుణామయు డయిన దేవునికి జాలి కలిగింది. మాలోని ఒక వ్యక్తిని దేవుడు తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఆయన వంశాన్ని గురించి మాకు బాగా తెలుసు. ఆయన ఎంతో శ్రేష్టమయిన వంశీయుడు. ఆయన సత్యసంధుడు, నిజాయితీపరుడు, పరిశుద్ధ చరితుడు, సద్గుణ సంపన్నుడు. మిత్రులే కాదు శత్రువులు కూడా అతని మంచితనాన్ని ఒప్పుకుంటారు. ఆయన మాకు ఇస్లాం సందేశాన్ని అందజేశారు. మేము విగ్రహాలను పూజించటం త్యజించాలనీ అల్లాహ్ ఒక్కణ్ణే మా స్వామిగా, ప్రభువుగా నమ్మాలనీ, ఆయనకే దాసులై మెలగాలనీ బోధించాడు. నిత్యం సత్యాన్నే పలకాలని, రక్తపాతం, హత్యాకాండలు విడనాడాలని, అనాధల సొత్తును కాజేయకూడదని, పొరుగువారికి సహాయపడాలని, అశ్లీల చేష్టల సమీపానానికి కూడా పోకూడదని ఉపదేశించాడు. నమాజ్ చెయ్యాలని, రోజావ్రతాన్ని పాటించాలని, దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టాలని, అనాధల్ని, నిరుపేదల్ని ఆదరించి సహాయం చెయ్యాలని ఆదేశించాడు. మేము ఆయన్ని విశ్వసించాం. బహుదైవారాధన, విగ్రహారాధనల్ని వదలిపెట్టాము. చెడ్డపనుల్ని విడిచిపెట్టాము. అందుచేతనే మా జాతివారు మాకు విరోధులై పోయారు. మేము తిరిగి వాళ్ళ మతాన్నే ఆశ్రయించాలని వారు మమ్మల్ని బలాత్కరిస్తున్నారు."



ఇదంతా విని నీగస్, "అయితే మీ ప్రవక్తపై అవతరించిన దైవవాణి కొంచెం వినిపించండి" అని అన్నాడు. హజ్రత్ జాఫర్ (రజి) 'మర్యమ్' సూరాలోని కొన్ని ఆయత్‌లను పఠించారు. అది విని నీగస్ ఎంతో ప్రభావితు డయ్యాడు. అతని కళ్ళవెంట అశ్రువులు ప్రవహించసాగాయి. "దైవసాక్షి! ఈ వాణి సూక్తులు, బైబిల్ ప్రవచనాలు రెండూ ఒకే జ్యోతి నుండి ప్రసరిస్తున్న కిరణాలు" అని అప్రయత్నంగా ఒప్పుకున్నాడు. అప్పుడు ఖురైష్ ప్రతినిధులు "రాజా! వీరు ఏసుక్రీస్తుకు కూడా వ్యతిరేకులే" అని చెప్పారు. వీరలా అనటా నికి కారణం నజాషి రాజు క్రైస్తవ మతస్థుడు కావడమే. క్రైస్తవులు ఏసుక్రీస్తును దైవకుమారుడుగా భావిస్తారని, ముస్లింలు ఈ భావనకు వ్యతిరేకం కనుక రాజు కోపగ్రస్తుడవుతాడని వారు అనుకున్నారు. ఏసుక్రీస్తు గురించి నజాషిరాజు ముస్లింలను ప్రశ్నించగా, హజ్రత్ జాఫర్ (రజి) ఎలాంటి తడబాటు లేకుండా హజ్రత్ ఈసా (అలైహి) దేవుని దాసుడని, దైవసందేశదాత అని మా ప్రవక్త మాకు తెలిపారని సమాధాన మిచ్చారు. ఈ మాట వినగానే నీగస్ ఒక గడ్డిపోచ నేలపైనుండి పైకెత్తి "దేవుని సాక్షి! ఏసు నీవన్నదానికంటే దీనిమందం కూడా అధికం కాదు. బైబిల్ సారాంశం కూడా ఇదే" అని అన్నాడు. దీంతో ఖురైష్ ప్రతి నిధుల పాచిక పారలేదు. ఆ తరువాత వారికి నజాషిరాజు సమాధానమిస్తూ "వీరు నాకు నిజాయితీపరులుగా కనబడుతున్నారు. ఇప్పుడు వీరు నా శరణులోకి వచ్చారు కనుక వీరిని మీకు అప్పగించలేను" అన్నాడు.

గత్యంతరం లేక ఖురైష్‌లు ముఖాలు వ్రేలాడేసుకొని వెనుతిరిగారు. (1, ఇస్లామీయ చరిత్ర- అక్బర్‌షా నజీబాబాది వా-1, పేజి. 110,111. 2, సీరతున్నబి షుబ్లినొమాని వా-1, పేజి. 239)

# 6. హజ్రత్ ముసఅబ్ బిన్ ఉమైర్ (రజి)

సిరిసంపదలు, భోగభాగ్యాలు, పదవీహోదాలు ప్రాపంచిక వ్యామోహ పరుల్ని ఎల్లప్పుడూ ఆకట్టుకుంటాయి. నేటికాలంలో కూడా ఇవే మనిషి గొప్పతనానికి కొలమానాలుగా ఉన్నాయి. అలాంటివారికే సమాజంలో

గుర్తింపు లభిస్తుంది. అందుచేత ప్రాపంచిక వ్యామోహపరులు వీటి వెనుకే పరుగెత్తు తుంటారు. నైతిక విలువల్ని తుంగలో త్రొక్కి అయినా సరే వీటిని పొందడానికి తహతహలాడుతారు. మోసాలకు, లంచాలకు మరిగి, జూదమాడి, ఏవిధంగానైనా సరే డబ్బు కూడబెట్టాలన్న తాపత్రయం నేటి మానవుల జీవిత ధ్యేయమై పోయింది.

అంతిమ దైవప్రవక్త (స) కాలంలో అల్లాహ్ను, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించినవారు పూర్తి విశ్వాసంతో నిండు మనస్సుతోనే విశ్వసించి ఇస్లాం స్వీకరించారు. కనుకనే వారు నైతిక విలువలకు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చారు. వారు మనోవాంఛలకు బానిసలు కాలేదు. ప్రపంచంలోని భోగభాగ్యాలు, తళుకుబెళుకుల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. వారు ఎల్లప్పుడూ తోటి మానవుల శ్రేయస్సునే కోరుకుంటుండేవారు.

ఈ సందర్భములో హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవచ్చు. ఆయన మక్కాలోని ఒక ధనిక కుటుంబానికి చెందిన యువకుడు. ఎల్లప్పుడూ ఖరీదైన దుస్తులు వేసుకొని తన స్నేహితుల మధ్య విశిష్ఠవ్యక్తిగా, యువరాజుగా కనిపించేవారు. ఆ కాలంలో ముస్లింలు రహస్యంగా దైవప్రవక్త (స)తో పాటు 'అర్ఖమ్' ఇంటిలో దైవారాధన కోసం సమావేశమయ్యేవారు. హజ్రత్ ముసఅబ్ (రజి) కూడా ఈ ఇస్లామీయ కేంద్రానికి వచ్చి దైవప్రవక్త (స) సమక్షంలో ఇస్లాం స్వీకరించారు. అది ఇస్లాం స్వీకరించిన వారికి మహా గడ్డుకాలం. ఎవరయినా ఇస్లాం స్వీకరించారని తెలిస్తే చాలు అతనిపై కడగండ్ల కొండలు విరుచుకుపడేవి. మిత్రులు శతృవులుగా మారిపోయేవారు, ప్రేమ ద్వేషంగా మారిపోయేది. సమాజం మొత్తంగా అతడ్ని వెలివేసేది. (హయాతుస్సహాబ-వా-1 పే- 386)

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ ఇస్లాం స్వీకరించాడనే వార్త ఆయన తల్లికి తెలియగానే ఆమె ఆగ్రహోదగ్రురాలయింది. ఆయన బంధువులంతా ఆయనకు వ్యతిరేకులయ్యారు. వారి ప్రేమ ద్వేషంగా మారింది. మొదట నానా విధాల దుర్భాషలాడారు. ఎంతగానో నచ్చజెప్పారు. వినకపోయే సరికి తాళ్ళతో బంధించి ఒక గదిలో పడవేశారు. (హయాతుస్సహాబా-వా-1, పేజి. 387)



అయితే ఈ బలాత్కారాలు, హింసాదౌర్జన్యాలు, అజ్ఞానం, మూఢత్వాల పట్ల ఆయన హృదయంలోనున్న ద్వేషాన్ని ఇంకా పెంచాయే తప్ప ఆయన్ను ఇస్లాం నుండి మరల్చలేకపోయాయి. ఆయన సత్యానికి, ఇస్లాం ధర్మానికి మరింత దగ్గరైపోయారు. అంతేకాదు, ఈ నిర్బంధం నుండి ఎప్పుడు బయటపడి, ధర్మప్రచారం చేస్తానా అని కుతుహాలం కలిగి ఉండేవారు. ఆ తరువాత కొన్నాళ్ళకే ముస్లింలు అబిసీనియాకు వలసవెళ్ళాలని దైవప్రవక్త (స) ఆజ్ఞా పించారు. దైవప్రవక్త (స) అబిసీనియా వలసపోవటానికి అనుమతించారనే వార్త చెవిలో పడగానే ఆయన వలస పోవడానికి ఎంతగానో ఆదుర్దా పడ్డారు. ఎలాగో తనను బంధవిముక్తుడ్ని చేసుకొని అబిసీనియా బయలుదేరారు.

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) ధనిక కుటుంబంలో ఎంతో గారాబంగా పెరిగి, తల్లిదండ్రుల ప్రేమానురాగాలు తప్ప ప్రపంచంలో ఇంకేమీ చూడని నవయువకుడు. విలాసవంతమైన జీవితం గడపటం తప్ప జీవితంలో ఏనాడూ కష్టాలు, బాధలు ఎరగనివాడు. అలాంటి యువకునికి ఇస్లాం స్వీకరించగానే కష్టాల పర్వం ప్రారంభమయింది. అదే పరిస్థితిలో ఆయన అబిసీనియాకు వలసపోయారు. కొన్ని సంవత్సరాల తరువాత అబిసీనియా నుండి తిరిగి మక్కా చేరుకున్నప్పుడు ఆయన ఒంటిపై ఓ చినిగిపోయిన గొంగళి తప్ప మరేమీ లేదు. తిన్నగా దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి సలామ్ చేశారు. దైవప్రవక్త (స) ఆయనకు ప్రతి సలామ్ చేస్తూ, ఇతర అనుచరుల్ని సంబోధిస్తూ ఇలా అన్నారు:

"ప్రపంచం ఒక్కొక్కప్పుడు ప్రపంచవాసులకు అపరిచితమై పోతుంది. మక్కాలో ముస్అబ్ తన తల్లిదండ్రులకు ఎంత ప్రియమైన పుత్రుడో వేరొక యువకుడెవరూ లేని కాలాన్ని నేను చూశాను. కాని ఇప్పుడు అల్లాహ్, ఆయన ప్రవక్త ప్రేమాభిమానాలు వీటన్నిటి నుండి ఆయన్ను దూరం చేశాయి." (తబ్ఖాత్ ఇబ్నెసఅద్-వా-3, పేజి. 277)

మదీనాలో ఇస్లాం సందేశ ప్రచారం ప్రారంభమైనప్పుడు, అన్సార్

ముస్లింల కోరికపై దైవప్రవక్త (స) హ్రజత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)ను అక్కడికి పంపి వారికి ఖుర్ఆన్ విద్యగరపమని, ప్రజల్ని ఏకేశ్వరుని వైపు ఆహ్వానించమని ఆదేశించారు. ఈ పని హజ్రత్ ముస్అబ్ (రజి) అంతరంగంలో మెదలుతుండిన ప్రగాఢవాంఛయే. అందుచేత ఆయన అత్యంత ఉత్సాహంతో మదీనా బయలుదేరారు. ఆయన మదీనావాసుల ఇళ్ళకు, తెగల దగ్గరకు, వారి ప్రత్యేక సమావేశాలకు వెళ్ళి ధర్మప్రచారం ప్రారంభించారు. ఈవిధంగా కొద్ది రోజుల్లోనే ప్రతి ఇంట్లో ఇస్లాం గురించి చర్చలు మొదలయ్యాయి. ప్రతి రోజు ఒకరిద్దరు ఇస్లాం స్వీకరించసాగారు. చివరికి ఆయన ఎక్కడకు వెళితే అక్కడ జనం ఆయన చుట్టూ చేరి నూతన ధర్మం గురించిన విషయాల్ని ఎంతో ఆసక్తిగా వినేవారు. ఆ రోజుల్లో ఆయన అసద్ బిన్ జిరారా ఇంట్లో ఉండేవారు. అక్కడ కూడా తరచుగా సమావేశాలు జరిగేవి.

సాద్ బిన్ మఆజ్, ఉసయ్యద్ బిన్ హుజీర్ లాంటి నాయకులు ఇంకా ఇస్లాం స్వీకరించలేదు. హ్రజత్ ముస్అబ్ (రజి) ప్రచారం చేస్తున్న విషయాలు తెలుసుకొని వారు అదిరిపడ్డారు. ఒకరోజు సాద్ బిన్ మఆజ్, ఉసయ్యద్‌తో ఇలా అన్నాడు. "ఎవరు వీరు మన ఇంట్లోకి చొరబడి వచ్చి మన బలహీన ప్రజల ఆలోచనల్ని మార్చేస్తూ వారిని పెడత్రోవ పట్టిస్తున్నారు? వారి ఉద్దేశం ఏమిటో కాస్త తెలుసుకొని రా." (తబ్ఖాత్- ఇబ్నె సాద్-వా-3, పే. 277)

ఉసయ్యద్ వెంటనే అసద్ బిన్ జిరారా (రజి) ఇంటికి వెళ్ళి ఆయనతో కఠినంగా మాట్లాడారు. దానిపై అసద్ (రజి) ఇలా అన్నారు: "నువ్వొక సారి ఈయన చెప్పేదేమిటో కాస్త ప్రశాంతంగా విను. నీకు నచ్చితే స్వీకరించు, నచ్చకపోతే విడిచిపెట్టు" ఇది విని ఉసయ్యద్ "నీవు చెప్పేది సమంజసంగా ఉంది" అంటూ బరిసెను నేలలో గుచ్చి సమావేశంలో కూర్చున్నారు.

హ్రజత్ ముసఅబ్ (రజి) ఇస్లాంలోని మౌలిక బోధనల్ని తెలిపి ఖుర్ఆన్ లోని కొన్ని సూక్తులు చదివి వినిపించారు. దైవవాణి ఉసయ్యద్ హృదయాన్ని మీటింది. వెంటనే ఆయన 'ఎంత మంచి మాటలు, ఎంత మనోహరమైన వచనాలివి' అని అన్నాడు. తరువాత "మీరు మీ ధర్మంలో చేర్చుకోవటానికి



ఏ పద్ధతి పాటిస్తారు?" అన్ని ప్రశ్నించారు. దానికి హ్రజత్ ముసఅబ్ ఇలా సమాధాన మిచ్చారు: "ముందుగా మీరు శుభ్రంగా స్నానం చేసి ఉతికిన బట్టలు వేసుకోండి. ఆ తరువాత కలిమయె షహాదత్ పఠించండి. అంతే." హ్రజత్ ఉసయ్యద్ అప్పటికప్పుడు ఇవన్నీ చేసి ఇస్లాం స్వీకరించారు. (హయాతుస్సహాబ-వా-1, పేజి.244)

సాధారణంగా ప్రజలు ఇస్లాంను దైవధర్మంగా గాక, ముస్లింల ధర్మంగా చూస్తారు. అందుకని ప్రారంభంలో దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తారు. కాని దైవవాణి విన్నాక, సత్యం తెలిసికొని ఇస్లాం ధర్మాన్ని విశ్వసించటంలో ఆలస్యం చేయరు. సాధ్యమైనంత త్వరగా అజ్ఞానం నుండి బయటపడాలని చూస్తారు. హ్రజత్ ఉసయ్యద్ (రజి) విషయంలో కూడా ఇలాగే జరిగింది. దైవవాణి వినగానే ఆయనకు కనువిప్పు కలిగి వెంటనే ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత ఆయన సఅద్ వద్దకు వెళ్లి, ఆయనను వెంటబెట్టుకొని వచ్చారు. ఆయనతో కూడా ఇదే సంభాషణ జరిగింది. ఖుర్ఆన్‌లోని కొన్ని ఆయత్‌లు వినగానే, ఆయన కూడా ఉసయ్యద్ లాగే ప్రభావితులై సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించారు. (హయాతుస్సహాబ- వా-1, పేజి.246)

హ్రజత్ సాద్ (రజి) అక్కడి నుండి హ్రజత్ ఉసయ్యద్ (రజి)ను వెంట బెట్టుకొని తన తెగవారి వద్దకు వచ్చారు. వారినుద్దేశించి "నేను ఎలాంటి వ్యక్తి అని మీరు భావిస్తున్నారు?" అని ప్రశ్నించారు. వారంతా ముక్తకంఠంతో మా అందరిలోకెల్లా మీరు ఉత్తములు, శ్రేష్ఠులు" అని బదులిచ్చారు. ఇది వినగానే ఆయన "అయితే వినండి. నేనిప్పుడు ముస్లింనై పోయాను. మీరందరు కూడా అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించి ముస్లింలు కానంతవరకు నేను మీలో ఏ ఒక్కరితో మాట్లాడకూడదని నిర్ణయించుకున్నాను' అని అన్నారు. (హయాతుస్సహాబ-వా-1, పేజి. 246)

ఎన్నో సంవత్సరాల నుండి వారు తమ తాత ముత్తాతల ఆచారాలు అనుసరిస్తూ ఒక మార్గంలో నడుస్తున్నారు. సత్య తిరస్కారం, మిథ్యాదైవాల ఆరాధనలో జీవితం గడుపుతూ శతాబ్దాలు గడిచి పోయాయి. కాని ఇప్పు

డీయన గారు ఇస్లాం స్వీకరించమని చెబుతున్నాడు. ఇతను ఏ పరాయివాడో, అనామకుడో కాదు. తమకు సుపరిచితమైన తమ తెగకు చెందినవాడే. పైగా ఇతను తమలో అందరికంటే ఎంతో విజ్ఞతా వివేచనలు కలవాడు; బుద్ధి కుశలత, వ్యవహార దక్షతలు కూడా కలిగిన నాయకుడు. అలాంటివ్యక్తి ఈరోజు తమను విగ్రహారాధన వదలి ఏకేశ్వరాధన వైపు ఆహ్వానించే ఇస్లాం ధర్మం స్వీకరించమని చెబుతున్నాడంటే ఇందులోనే మన శ్రేయస్సు ఉండవచ్చు... ఈ ఆలోచనాసరళి వారి హృదయాలపై వేట వేసిన అజ్ఞానపు పొరల్ని తొలగించి వేసింది. వెంటనే బనూ అబ్దుల్ అష్‌హల్ తెగకు చెందిన వీరంతా సంతోషంగా ఇస్లాం స్వీకరించారు. ఆ తరువాత హజ్రత్ ముస్‌అబ్ (రజి) వారి విద్యాశిక్షణల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఒక సంవత్సరం తరువాత ఆయన హజ్ యాత్రికుల ఒక బృందంతో కలిసి దైవప్రవక్త (స)వద్దకు వచ్చారు. మదీనాలో తాను చేసిన ధర్మప్రచారానికి సంబంధించిన నివేదికను ఆయనకు విన్పించారు. దైవప్రవక్త (స) ఈ నివేదిక వివరాలు విని ఎంతగానో సంతోషించారు. హజ్రత్ ముస్‌అబ్ (రజి) అక్కడి నుండి తన తల్లి వద్దకు వచ్చారు. ఆయన తన తల్లిని అమితంగా ప్రేమించేవారు. అందుకని ఆమెను ఎలాగైనా నరకాగ్ని నుండి తప్పించాలని, ఇస్లాం ధర్మాన్ని స్వీకరింపజేయాలని నిర్ణయించుకున్నారు. ఆయన ఎంతో వినయ విధేయతలు వ్యక్తపరుస్తూ, నమ్రతగా ఆమెతో ఇలా అన్నారు:

“అమ్మా! నేను నీ శ్రేయస్సును కోరుకుంటున్నాను. అందుకే నీవు సద్వచనం పఠించి, ఇస్లాం పరిధిలోకి రావాలని మనవి చేసుకుంటున్నానమ్మా!” (తబ్‌ఖాత్ ఇబ్నె సఅద్-వా-3, పేజి. 379)

కాని ఆ తల్లి ఆయన మాటను పెడచెవిన పెట్టింది. వినీ విననట్లు ఉండిపోయింది. బహుదైవారాధననే అంటిపెట్టుకున్నది. ఆ తరువాత హజ్రత్ ముస్‌అబ్ (రజి) తిరిగి మదీనా చేరుకుని ధర్మప్రచార కార్యకలాపాలలో నిమగ్నమైపోయారు. దైవప్రవక్త (స) హిజ్రత్ చేసి మదీనా వచ్చిన తరువాత హజ్రత్ ముస్‌అబ్ (రజి) అనుక్షణం ఆయన వెంట ఉండేవారు. ఇస్లాం ఉన్నతి



కోసం బద్ర్, ఉహుద్ యుద్ధాల్లో కూడా పాల్గొన్నారు. ఉహుద్ యుద్ధంలో దైవప్రవక్త (స) ఆయనకు సైనిక పతాకం ఇచ్చి పంపారు. భీకర యుద్ధం జరుగుతున్నప్పుడు కూడా ఆయన ఆ పతాకాన్ని ఎంతో పట్టుదలతో కింద పడనీయకుండా గట్టిగా పట్టుకున్నారు. కుడిచేయి తెగిపోతే ఎడమ చేత్తో పట్టుకున్నారు. ఎడమచేయి కూడా తెగిపోయినప్పుడు పళ్ళతో పట్టుకొని తెగిపోయిన చేతుల్తోనే గుండెకు పొదివి పట్టుకున్నారు. చివరి క్షణం వరకు దాన్ని పడిపోనివ్వ లేదు. చివరకు దైవమార్గంలో పోరాడుతూ క్రింద పడిపోయి అమరగతి పొందారు.

ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయన జీవితమంతా సమస్యలు, సంఘర్షణలలోనే గడచిపోయింది. జన్మస్థలం వదలి పరదేశాలకు వలస పోవడం, ధన ప్రాణ త్యాగాలు చేయటం మొదలైన ఘట్టాలతో ఆయన జీవితం ముగిసింది. ఖననం సమయంలో కూడా ఆయన ఒంటి మీద ఒక చిన్న దుప్పటి తప్ప మరేమీ లేదు. కాని ఆయన భౌతిక కాయానికి ఆ దుప్పటి కప్పితే తల బయటుండేది; తలను కప్పితే కాళ్ళు బయటుండేవి. చివరికి దైవప్రవక్త (స) “తల మీద గొంగళితో కప్పి, కాళ్ళ మీద గడ్డి వేసి కప్పండి.” అని చెప్పారు.

ఎంతో గారాబంగా, భోగభాగ్యాలతో విలాసవంతమైన జీవితం గడిపి చివరికి అతి దీనావస్థలో ప్రపంచాన్ని వీడిన హజ్రత్ ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి) జీవిత గాథ ఇది. అయితే ఏం, ఇస్లాం చరిత్రలో ఆయన పేరు మాత్రం సువర్ణాక్షరాలతో వ్రాయబడింది. సత్యప్రేమికులు, మంచిని కోరేవారు ఆయన పేరును ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారు.